

# సత్వర చర్యలు

- మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- విద్యార్థులను సిబ్బంది సొంత బిడ్డల్లా చూసుకోవాలి


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

మంగళవారం | 19 ఆగస్టు 2025 | 15 పేజీలు


- ఉమ్మడి జిల్లాలో మూడో రోజూ వర్ష బీభత్సం..
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట చేలు
- లో లెవల్ వంతెనపై పారుతున్న వరద నీరు..
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు.. వంకలు..
- కోతకు గురైన వంతెనలు, ప్రధాన రహదారులు..
- అనేక గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 ఎత్తి దిగువకు నీటి విడుదల..
- ఉగ్రరూపం దాల్చిన ప్రాణహిత, పెన్‌గంగ నదులు
- వరదతో మహారాష్ట్రకు నిలిచిపోయిన రాకపోకలు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- పంట నష్టం అంచనాలో జిల్లా అధికార యంత్రాంగం
- నేడు జిల్లాకు రానున్న ఇంచార్జీ మంత్రి జూపల్లి
- ఉమ్మడి జిల్లాలో పర్యటన..

# చినుకు వదలదు.. వరద కదలదు



ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

మొఖం చాటేసిన వానలు ఒక్కసారిగా దంచి కొడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తారంగా కురుస్తోన్న వానలతో జలకళ సంతరించుకుంది. ఎడతెరపి లేకుండా మూడు రోజులుగా దంచి కొడుతున్న వర్షంతో ఉమ్మడి జిల్లా తడిసి ముద్దయింది. భూగర్భ జలమట్టం అమాంతం పెరిగేందుకు ఈ వానలు ఉపకరించాయి. పలు చోట్ల సాధారణ వర్షాపాతం కంటే ఎక్కువే వాన పడటంతో భారీ వర్షాపాతం నమోదైంది. మొన్నటి వరకు లోటు వర్షాపాతం కొట్టుమిట్టాడిన మండలాల్లో అల్పపీడన ప్రభావం మూలంగా కురిసిన వానలతో కరువు ఛాయల నుంచి బయట పడేసింది. అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలో ఏకధాటి వానలు కొనసాగాయి. ఎల్లో హెచ్చరిక జారీ కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తెరపి లేకుండా కురుస్తోన్న వానలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. కుమ్రంభీం జిల్లాలో వార్ధా, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిర్పూర్(టీ) సమీపంలోని హుడిలికి వద్ద వంతెనపైకి వరద పొంగడంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచాయి. మంచిర్యాల జిల్లాలో కాలనీలు నీటమునిగాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జనజీవనం అతలాకుతలమైంది. వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి..

## నేడు జిల్లాకు మంత్రి 'జూపల్లి'



రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. మంగళవారం నిర్మల్, ఆదిలాబాద్, జిల్లాల్లో పర్యటిస్తారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి రోడ్డు మార్గాన 10 గంటలకు నిర్మలకు చేరుకుంటారు. జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన అనంతరం కలెక్టరేట్‌లో వరదలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్ట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.



4

## వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- అందరూ నిబంధనలు పాటించాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.



## జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ మర్రి ప్రవీణా రెడ్డి మృతి

## అధైర్య పడొద్దు

- పంట నష్ట పోయిన రైతులను ఆదుకుంటాం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమతంగా ఉండాలి
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

వర్ష ప్రభావ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. సోమవారం ముత్నూర్ గ్రామంలో త్రివేణి సంగం ప్రాజెక్ట్‌తో పాటు కోతకు గురైన రోడ్డు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



## ఆ జీవోను తక్షణమే రద్దు చేయండి

15



- ఎమ్మెల్యే పాల్వాయి హౌస్ అరెస్టు..
- పోడు రైతుల సమస్యపై స్పష్టత కరువు
- పోడు రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం
- పాల్వాయి ఆమరణ నిరాహార దీక్ష..
- కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయం వద్ద పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు

పోడు రైతుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. పోడు రైతుల సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలన్న ప్రధాన డిమాండుతో హరీష్ బాబు సోమవారం తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా రద్దు చేసిందని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తామని ప్రకటించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలకు అండగా సురక్షిత చర్యలు

- లోతట్టు, వరద ప్రభావిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి పునరావాసం కల్పించాలి
- వాగులు, నదులు ఉధృతంగా ప్రవ హించే సమయంలో ప్రజలను, అటువైపుగా వెళ్లవద్దు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్..



**తాండూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజా రక్షణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలోని ఎస్.సి. కాలనీ, మండల కేంద్రంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జ్, నర్సాపూర్ ప్రాంతంలోని చెక్ డ్యామ్‌ల వద్ద పరిస్థితులను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తాండూర్ మండల తహాశిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా పోలీసు శాఖ సమన్వయంతో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని, రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్న ప్రాంతాలలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా, వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని, తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని, జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో తక్షణ సహాయం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**
వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. 24 గంటల నుంచి 36 గంటలు భారీ వర్షసూచన ఉన్నదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల కోసం 08736-250501కు ఫోన్ చేయాలన్నారు.



# కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ఆందోళన



**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
పీఎం శ్రీ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, పేస్ క్యాప్షర్, ఈకేవైసీ యాప్ లను రద్దుచేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.18 వేల వేతనం హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ నిరసనను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో ఉండాల్సిన పిల్లలతో ఎశ్రీ పాఠ శాలలు ఏర్పాటు చేసి అంగన్వాడీ సెంటర్లను నిర్వీర్యం చేసే కుట్రల కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నాలుతున్నాయని మండిపడ్డారు. పీఎం శ్రీ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రంలోనే నిర్వహించాలని, పీఎం శ్రీ టీచర్లకు, ఆయాలకు ఇస్తున్న వేతనాన్ని అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు ఇవ్వాల ని ఆ బడ్జెట్ ను అంగన్వాడీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫేస్ క్యాప్షర్, ఈకేవైసీ ఆన్లైన్ పేరుతో అంగన్వాడీ లను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. నెట్ సిగ్నల్ సరిగా లేక, పాడైన ఫోన్‌లో అటవీ ప్రాంతంలో ఎలా చేస్తారని ప్రశ్నించారు.

**అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి....**
అంగన్వాడీలకు వేధింపులను ఆపాలన్నారు. ఈ విద్యావాలంటీర్ల వేతనాలను అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు అందిస్తే తాము నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. అదే విధంగా ప్రీ ప్రైమారీ విద్యను అందిస్తున్నందున ప్రైమరీ పాఠశాలకు కేటాయించే నిధులు అంగన్వాడీలకు ఇవ్వాలన్నారు. తమ ఫోన్లు ఉన్నాయా లేదా వాటి గురించి పట్టిచుకోకుండా ఫెసక్యాప్చర్ పంపాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. దాని కారణంగా నార్నూర్ ఓ అంగన్వాడీకి బ్రెన్ స్ట్రోక్ వచ్చిందన్నారు. ఎఫ్ఆర్‌సీ విధానంతో పేదలకు అంగన్వాడీల ద్వారా అందే సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం  పేస్ క్యాప్షర్, ఈకేవైసీ యాప్ లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సుజాత, డీ.సునీతజ, లక్ష్మి, పార్వతి, మధునిక, విజయ, కళావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు హౌస్ అరెస్ట్

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును సోమవారం ఉదయం కాగజ్ నగర్ పట్టణ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పోడు రైతుల అక్రమ అరెస్ట్, హక్కుల సాధన కోసం బీజేపీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ డివిజన్ ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యేను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, బీజేపీ ముఖ్యనేతలను అరెస్టు చేసి కెరమెరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకులను అరెస్ట్ చేసి తనను గృహ నిర్బంధం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వారి నిర్లక్ష్యం వల్లే గ్రామాలు

# ఖాళీ చేయించే పరిస్థితి వచ్చింది

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
పోడు రైతుల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు విమర్శించారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు రైతుల కోసం ఫారెస్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానన్న తనను కాంగ్రెస్ నాయకులు పోలీసులచే అక్రమంగా గృహ నిర్బంధం చేయించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్యాల గ్రామ సమస్యలను పరిష్కరించమని చెబుతున్నా కాంగ్రెస్ నాయకుల నిర్లక్ష్యం వల్ల గ్రామం ఖాళీ చేసే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. అలాగే చాలా గ్రామాల్లో రోడ్లు, కనీసం మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను నిర్మించకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో లేక హైదరాబాద్ లో కూర్చుని ప్రెస్ మీట్



ఇవ్వడం కాదు..! గ్రామాల్లో వెళ్లి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూడాలని ఎమ్మెల్సీ దండె విఠల్ కు హితవు పలికారు. పోడు రైతుల సమస్యలను పరిష్కరించకుండా నియోజకవర్గంలోని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి లేదని చెప్పారు. ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం మాని.. పోడు రైతుల సమస్యలు పరిష్కారించేలా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు.



## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీస్ ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు ముఖ్య అధికారిని జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు కలిసి సమస్యలను తెలియజేశారు. దాదాపు 20 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించగా అందులో కుటుంబ కలహాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, పలు కేసుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమాజంలో 24 గంటలు ప్రజల రక్షణ భద్రతకై పనిచేసే ఏకైక వ్యవస్థ జిల్లా పోలీసు వ్యవస్థ అని తెలియజేస్తూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా వాగులు కల్వర్టులు వంతెనలు పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాలలో పోలీసు సిబ్బందిని కేటాయించి రాకపోకలను మూసివేయాలని సూచించారు. జిల్లా ప్రజలు అసాంఘిక కార్యకలాపాలను జరుగుతున్న సమాచారం ఏదైనా మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో భాగంగా 8712659973 అనే నెంబర్ కి సమాచారాన్ని అందించవచ్చుని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదుదారులలో పోలీసు వ్యవస్థ పరిధి దాటి ఉన్న ఆస్తి తగాదాలు, భూమి తగాదాలు పంచాయితీలు ఉన్న వాటికి చట్ట ప్రకారం ఉన్న నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో పరిష్కరించబడే ఏ ఫిర్యాదు నైనా వెంటనే స్వీకరించి పరిష్కరించి ప్రజలకు సరైన సమయంలో న్యాయాన్ని అందించి లబ్ధి చేకూర్చాలని సూచించారు.



## ప్రజావాణి దరఖాస్తులను
# త్వరితగతిన పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సుందిళ్ల నరేందర్, సుందిళ్ల రాజమ్మ, సుందిళ్ల సులోచనలు తమ కుటుంబ పెద్ద పేరిట నస్పూర్ శివారులో గల భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకొని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం పెద్దనపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన సఫియా, అబ్దుల్ బి తాము ప్రభుత్వ జి.ఓ.59 ప్రకారం తమ భూమి క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వ రుసుము చెల్లించామని, పట్టా మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి, సుబ్బారావు పల్లి గ్రామానికి చెందిన హనుమాండ్లు తమ కుటుంబం గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిలో తాను 25 సంవత్సరాల క్రితం టేకు చెట్లు నాటి సంరక్షించానని, వాటిని తొలగించి వ్యవసాయ సాగు చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ మాజీ సర్పంచ్ మంద అనిత తన దరఖాస్తులో తమ గ్రామంలోని ఎర్రకుంట చెరువు పై ఆధారపడి రైతులు, మత్స్యకారులు జీవించేవారని, కొంతమంది రియల్ ఎస్టేట్ వారు అక్రమంగా చెరువుకి గండి కొట్టి భూముల ఆక్రమణకు పాల్పడడంతో ఎంతో నష్టం జరుగుతుందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి చెరువు పునరుద్ధరించి రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దూట లక్ష్మణ్ తాను గతంలో కొనుగోలు చేసిన భూమికి భూ భారతి చట్టం ప్రకారం పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## వరద ముంపు ప్రాంతాల్లో
# పర్యటించిన ఎమ్మెల్యే

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలుకాలనీలు వరదల్లో మునిగిపోవడంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ఆయన నడుమంటే నీళ్లలో నడుచుకుంటూ వెళ్లి, ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ, అంకోలి, తంతోలి గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# ముధోల్ నియోజకవర్గంలో కొత్తగా 32 పోలింగ్ కేంద్రాలు

**ముధోల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** ముధోల్ నియోజకవర్గంలో కొత్త గా మరో 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తు న్నట్లు సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమ వారం నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒక పోలింగ్ కేంద్రంలో 1200లకు మించి ఓటర్లు ఉంటే, వాటిని విభజించి అదనపు పోలింగ్ కేం ద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 311 పోలింగ్ కేం ద్రాలు ఉండగా, అదనంగా 32 కేంద్రాలు (కు భీర్-02, కుంటాల-02, భైంసా-24, ముధోల్ -03, తానూర్-01) ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కుభీర్ లో ఓ పోలింగ్ కేంద్రాన్ని వేరే భవనానికి మార్చుతున్నట్లు పేర్కొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**



**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధమై ఉందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లావ్యాప్తంగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్న గణేష్ మండప నిర్వాహకులు, సభ్యులు, కమిటీ సభ్యులు, పోలీస్ శాఖ రూపొందించిన గణేష్ మండప నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్‌లో https://policeportal.tspolice.gov.in/index.htmలో వివరాలను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ వెబ్‌సైట్‌లో నందు వినాయక మండప వివరాలు, వినాయక చవితి మొదలు, నిమజ్జన తేదీ, సమయం, ప్రయాణించే దారి, మండప ప్రదేశం, ప్రదేశం ఓనర్ వివరాలు, గణపతి విగ్రహ ఎత్తు, మండపం ఎత్తు, సంబంధిత పోలీస్ స్టేషన్, నిమర్జనం ప్రదేశం, మండపానికి సంబంధించిన సమాచారం, గణపతి తీసుకువెళ్లే వాహన వివరాలు డ్రైవర్, యజమాని వివరాలు పొందుపరచాలని సూచించారు. అదేవిధంగా మండప నిర్వహకులు, గణపతి కమిటీ సభ్యులు, వాలంటీర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలన్నారు. అత్యవసర సమయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో అప్రమత్తంగా ఉంటుందని డయల్ 100కు సంప్రదించాలన్నారు.



# అంగన్వాడీల నిరసన

**ఉట్నూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** అంగన్వాడీల సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. జిల్లాలో సోమవారం కూడా వర్షం కురవడంతో అంగన్వాడీలు వర్షంలో నిరసన తెలిపి ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా.. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీలకు ఫేస్ క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అంగన్వాడీల దీర్ఘకాలిక డిమాండ్ల అయిన కనీస వేతనాలు, పెన్షన్లు, ఉద్యోగ భద్రత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుయీటిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సంఘం జిల్లా నాయకురాలు రత్నమాల, పార్వతీ, రాశిక, సత్తమ్మ ఉన్నారు.

## జిల్లాలో భారీ వర్షం..
## వరదలో కొట్టుకొచ్చిన
# కండోమ్ ప్యాకెట్లు

**మందమర్రి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుంది. ఈ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అయితే.. భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తూ ఉంటాయనే విషయం తెలిసిందే. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఒక వింత ఘటన చోటుచేసుకుంది. వరదలో వేల సంఖ్యలో కండోమ్ ప్యాకెట్లు కొట్టుకు వచ్చాయి. ఇవి హెచ్ఐవి ని అరికట్టేందుకు ప్రభుత్వం ఐటిసిటీ సెంటర్లకు సరఫరా చేస్తుంది. వాటిని అలాగే నిల్వ ఉంచడంతో వరదల్లో కొట్టుకువచ్చాయని ప్రజలు, స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**లక్ష్మణచందా, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం లక్ష్మణచందా మండలం కనకాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్ల చుట్టూ చెత్త, నిల్వ నీరు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటికే గ్రామంలో జ్వరాల బారిన పడిన వారి వివరాలు, అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరో గ్యశాఖ అధికారి డా. రాజేందర్, మండల ప్రత్యేక అధికారి అంబాజీ, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగుకు అవసరమైన యూరియాను

# ప్రణాళికబద్ధంగా రైతులకు అందించాలి

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు






**మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో పంట సాగుకు అవసరమైన యూరియా ప్రక్కదారి పట్టకుండా ప్రణాళికబద్ధంగా రైతులకు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు అన్నారు. సోమవారం హైద రాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో యూరియా నిల్వలు, సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న యూరియాను వ్యవసాయ సాగుకు అవసరం మేరకు ప్రణాళికబద్ధంగా రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జూలై, ఆగస్టు మాసాలలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున యూరియా వాడకం పెరిగిందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు ఈ నెల ఆఖరు వరకు అవసరం మేరకు పొదుపుగా రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాలోని ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను తనిఖీలు చేసి, ప్రతి రోజు స్టాకు వివరాలను సమర్పించాలని, యూరియా ప్రక్క దారి పట్ట కుండా జిల్లాలో టాస్క్ ఫోర్స్ కమిటీలను నియమించి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీలర్ల షాపులలో నిల్వలు, ధరల వివరాలు ప్రదర్శించాలని, కొనుగోలు చేసిన రైతులకు సంబంధిత రశీదు తప్పకుండా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా యంలోని వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2 వేల 692 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, గత సంవత్సరం కంటే ఈసారి 500 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా రైతుల కు అందించడం జరిగిందని తెలిపారు. యూరియా అయి పోతుందనే అవాస్తవ సమాచారంతో జిల్లాలోని కోటపల్లి, చెన్నూర్ ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితిని ప్రత్యేక అధికారు లను నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ, రెవె న్యూ, పోలీసు శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీమ్ను ఏర్పాటు చేసి, సరిహద్దుల వద్ద చెక్పోస్టులు ఏర్పాటు చేసి యూరియా అక్రమ రవాణా జరుగకుండా విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ, సహకార శాఖ, ఇతర అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని రైతులు, సాగు అవుతున్న భూమి విస్తీర్ణం, పంట సాగు రకం పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసా య అధికారి భుక్యా ఛాత్రు, జిల్లా సహకార అధికారి రవీందర్ రావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి





**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావర ణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్లోని ఓ ఫంక్షన్ హాల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండప నిర్వహణ కమిటీ సభ్యులకు ఆన్లైన్ నందు రిజిస్ట్రేషన్ చేసుకుని వివరాలను నమోదు చేయాలని సూచించారు. తద్వారా ఏర్పాటు చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమర్జనం ఏర్పాట్లకు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసే విధంగా ప్రజలందరూ కలిసికట్టుగా ఉన్న భా వాన్ని తెలియజేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటు చేసే వారికి అనుమతులు లేవని తెలి పారు. ఆదిలాబాద్ పట్టణం, జైనథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాలలో ఏర్పాటు చేయనున్న గణపతి మండప నిర్వాహక కమిటీ సభ్యులు, ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్, డిఎస్పీ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, రూరల్ సీఐ కె ఫణిదర్, జైనథ్ సిఐడి సాయినాథ్, ఇచ్చోడ సీఐ రాజు, హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు హనుమాన్లు, హిందూ ఉత్సవసమితి సభ్యులు పాల్గొన్నారు.



## భారీవర్షాల నేపథ్యంలో

# ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాల కారణంగా ప్రజలు ఆరోగ్యపరంగా జా గ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధి కారి డా. నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశా రు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, నీటిబారిన వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు పలు సూచనలను పాటించాలని సూచించారు.

**ప్రజలు ఈ సలహా సూచనలు పాటించాలి..**

◆ మరిగించి చల్లార్చిన నీటినే తాగాలి.. శుద్ధి చేసిన నీరు మాత్రమే ఉపయోగించాలి.

◆ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసు కోవాలి. పూల కుండీలు, కూలర్, టైర్లు, డబ్బాలలో నీరు నిల్వ లేకుండా తరచుగా శుభ్రం చేయాలి.

◆ దోమల కాటుకు గురి కాకుండా మస్కిటో నెట్స్, కా యిల్, రిపెలెంట్స్ వాడాలి. పూర్తి బట్టలు ధరించాలి.. బయట వర్షపు నీటిలో ఆడకూడదు, నడవకూడదు.

◆ బయట పాడైపోయే ఆహారం తినకూడదు. తాజాగా వండి వేడి వేడి ఆహారమే తీసుకోవాలి.

◆ జ్వరం, వాంతులు, విరేచనాలు, కళ్లలో పసుపు, శరీర నొప్పులు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ దవాఖాన/పీహెచ్.సి/సీహెచ్.సీలను సంప్రదించాలి. స్వయంగా మందులు వాడకూడదు.

◆ గర్భిణీలు, చిన్నపిల్లలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకో వాలి. ప్రమాదకర ప్రాంతాల్లో ఉండే గర్భిణీలను సురక్షిత ప్రదేశాలకు తరలించవచ్చు.

◆ ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవచ్చు. జిల్లా ఎపిడెమిక్ కంట్రోల్ రూమ్ నంబర్: 9491103108 ను సంప్ర దించాలని ఆయన సూచించారు.

# బాధిత రైతులను ఆదుకోవాలి

## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదు కునేందుకు ఎకరానికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బజార్ హత్నూర్ మండల కేంద్రంలో పంట పొలాలను ఆది వారం ఎమ్మెల్యే పరిశీలించి, నష్టపోయిన రైతులకు పల కరించి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా ఒత్తిడి తీసుకొస్తానని భరోసా కల్పించారు. నష్టపోయిన ప్రతీ గుంట భూమిని రికార్డు చేసి నివేదిక అందజేయాలని ప్రతీ ఒక్క రైతుకు న్యా యం జరిగేలా అధికారులు పని చేయాలని ఆదేశించా రు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



## జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలు,

# కళాశాల మంజూరు చేయాలి

### తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం

### జిల్లా ఉపాధ్యక్షురాలు మర్మల మల్లేశ్వరి

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి విద్యార్థులకు విద్యను అందించడానికి జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాల, గిరిజన కళాశాల మంజూరు చేయాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మర్మల మల్లేశ్వరి వినతిపత్రం సోమవారం నాడు అందజే శారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసి విద్యా ర్థులకు చదువుకోవడానికి సరైన వసతులు లేక చాలామంది ఆదివాసిపిల్లలు చదువుకు దూరంఅవుతున్నారనీ మంచిర్యాల జిల్లాలో గిరిజన గురుకుల పాఠశాలలు లేకపోవడం వలన ఇతర జిల్లాలకు వెళ్లి చదువుకోవలసి వస్తుందన్నారు. చాలా మంది పిల్లలు అంత దూరం వెళ్లి చదువుకోలేక వారి చదు వులను మధ్యలోనే ఆపివేస్తున్నారని,ఇతర జిల్లాలలో చదువు కున్న విద్యార్థులు వారి స్థానికతను కోల్పోవడం వలన ఉద్యో గాలు పొందలేకపోతున్నారని గుర్తు చేశారు. కాబట్టి జిల్లాలో ఆదివాసులలో విద్యను అభివృద్ధి చేయడానికి ఆదివాసులలో మూఢనమ్మకాలను పారదోలి యువతకు విద్యను అందించ దానికి గిరిజన పాఠశాల మరియు గిరిజన కళాశాల మంజూ రు చేయాలని కోరారు. ఆదివాసుల పైన కొంతమంది పెత్తం దారులు దాడులకు దౌర్జన్యాలకు ఎగబడుతున్నారు



వేమనపల్లి మండలంలోని బుయ్యారం గ్రామ ఆదివాసులకు చెందిన భూములను అగ్రవర్ణ పెత్తందారులు దౌర్జన్యంగాలా క్కుంటున్నారని, ఈ విషయంపై ఇప్పటివరకు జిల్లా కలెక్టర్కు డిసిపికి ఫిర్యాదులుచేయడం జరిగిందని ఇప్పటికైనా పెత్తం దారుల వేధింపుల నుండి అరికట్టి ఆదివాసీల పైన ఎలాంటి దౌర్జన్యలు జరగకుండా భూమిని మేము సాగు చేసుకునే వి ధంగా చూడాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కి వినతి పత్రంలోపేర్కొన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మర్మల మల్లేశ్వరి, నాయకులు మర్మల శంకర్,పోల్క జయ,తొర్రెం రామయ్య, మర్మల బిట్టు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఇచ్చోడ, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని ఫస్ట్ స్టెప్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆహ్లాదకర వాతావరణంలో కృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. పాఠశాలలో ఎల్కేజీ చదువుతున్న దానియ ఇర్ఫాన్ అనే చిన్నారి శ్రీకృష్ణుని వేషధారణ ధరించి నృత్యం చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. మత సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచి శ్రీకృష్ణుని వేషధారణ ధరించి నృత్యం చేసి అందర్నీ ఆహుతులను చేసిన చిన్నారి తో పాటు వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు. పాఠశాల యజమాన్య సిబ్బందితోపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖి చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో



ఇచ్చోడ, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సందర్శించారు. ఆస్పత్రిలో వరద నీరు ఎక్కువ చేరితే డెలివరీ అయిన బాలింతలను వేరే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మరియు, ల్యాబోరెటరీ, ఫార్మసీ, ప్రస్తుతి వార్డులను పరిశీలించి గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలు మరియు సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ మధురిమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## కాలనీలు జలమయం

మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
జిల్లాలో సోమవారం కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని కాలనీలు, ఎంసీహెచ్ వరదమయం అయ్యాయి. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వరద నీరు పట్టణంలోని సూర్య నగర్, హమాలి వాడ, తిలక్ నగర్, బృందావన కాలనీ, సున్నం బట్టి వాడ, హైటెక్ సిటీ తదితర వాడల్లోని ఇళ్లలోకి చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో జనజీవనం అతలాకుతలం అయ్యింది. రోడ్లపైకి నీరు చేరడంతో జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి ఆనుకుని ఉన్న రాళ్లవాగు, తోళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

**వరదమయంలో ఎంసీహెచ్...**
కాలేజీ రోడ్ లోని ఎంసీహెచ్ వరదమయం అయ్యింది. ఆసుపత్రి చుట్టూ వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసుపత్రిలోకి రావడానికి, బయటకు వెళ్లేందుకు రోగులు, అటెండర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



### పాల్వాయి దీక్ష నేపథ్యంలో
## బీజేపీ నాయకుల అరెస్టు



బెజ్జూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
మండలంలోని బిజెపి నాయకులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులో తీసుకున్నట్లు బిజెపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... ఉదయం తెల్లవారు జామున 4 గంటలకు అక్రమ అరెస్టు చేసి బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని అన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలను, పోడు రైతులను అరెస్ట్ చేసి వందలాది కిలోమీటర్ల దూరంలో వారిని వేరువేరు పోలీస్ స్టేషన్‌లకు తరలించడం బాధాకరమని అక్రమంగా అరెస్ట్ చేసిన వారందరిని విడుదల చేయాలని శాంతియుత నిరసనకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోడు రైతులతో కలిసి ఫారెస్ట్ అధికారులపై ఉద్యమాన్ని తారస్థాయికి తీసు కువెళ్తామని ప్రజల ఆగ్రానికి గురికాక తప్పదని హెచ్చరించారు.కాంగ్రెస్ నాయకులు ఫారెస్ట్ అధికారులు పోడు భూములు గుంజు కోవాలని చూస్తున్నారని వారి ఆటలు ఇక సాగవని అన్నారు.

### ఎడ్ల బండెక్కి.. వరద ప్రాంతాల్లో
## పర్యటించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లాలో గత 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాలతో పంటలు మునిగిపోయాయి. ఈ క్రమంలో వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయల్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా భోరజ్ మండలంలోని కేదర్పూర్, ఆకోలి, గిమ్మ, కోరాట, పూసాయి, పిప్పరావాడ తదితర గ్రామాల్లో తహసీల్దార్ రాజేశ్వరీ, అగ్రికల్చర్ అధికారులతో కలిసి ఎడ్ల బండెక్కి పంట పొలాల్లో కలియ తిరుగుతూ రైతన్నల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన పంటను పరిశీలించారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా సీఎం రేవంత్ రెడ్డి కి ఉత్తరం రాసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పంట నష్ట వివరాలను కేంద్ర మంత్రులకు సైతం తెలియజేస్తామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు అశోక్ రెడ్డి,సన్నీ గంగాధర్, సంజు, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎర్ర కుంట చెరువును కాపాడాలని కలెక్టర్‌కు వినతి



బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల ఎర్రకుంట చెరువును కబ్జాల నుండి కాపాడాలని సోమవారం మంచిర్యాలలోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 45 లో ఎర్రకుంట చెరువు పూర్తిగా కబ్జాకు గురైందని ఆమె వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. 3.28 విస్తీర్ణంలో ఎర్ర చెరువు ఉందని, బఫర్ జోన్, ఎఫ్ టి ఎల్ కలుపుకొని మరో 10 ఎకరాలు ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఒక ఎకరం కూడా లేదని తెలిపారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువుకు గండి కొడుతూ నీరు నిలవకుండా చేసి ప్లాట్లు ఏర్పాటు చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. 60 రైతు కుటుంబాలు ఆ చెరువుపై ఆధారపడి వ్యవసాయం కొనసాగించేవని, చెరువు పూర్తిగా కనుమరుగవ్వడంతో ప్రస్తుతం బీడు భూముల్లో వ్యవసాయం సాగించలేని పరిస్థితి ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. 65 మత్స్యకారుల కుటుంబాలు కూడా ఈ చెరువు పైనే జీవనోపాధి పొందేవని, నీరు నిలువలేక వారి జీవనోపాధికి ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎర్రకుంట చెరువు కబ్జా జరుగుతున్న విషయం అనేకసార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు.



## హైలెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలి
### ఆదివాసీల నిరసన దీక్ష

తాండూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
మండలంలోని గిరిజన గ్రామాల పరిధిలో హైలెవెల్ వంతెనలు, రోడ్ డ్యాంలు నిర్మించాలని ఆదివాసీ సంఘం నాయకులు సోమవారం తాండూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు మాట్లాడారు. సింగరేణి చెక్‌పోస్టు నుంచి నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో భీమన్న వాగుపై హైలెవల్ బ్రిడ్జి, లచ్చుగూడ వద్ద మరో బ్రిడ్జి నిర్మించాలని కోరారు. వర్షాల వల్ల దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చిన రోజు తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేయడం వల్ల ఆదివాసీ ప్రజానీకానికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, సోము, ఎల్కుల శ్రీను, సోయం పర్వత్, రావు, తుమ్రం జంగు, కుర్సెంగ లచ్చు, తొడసం జోగు, పోయం మోతీరాం, తుడుందెబ్బ, రాయ్ సెంటర్, నాయక్పోడ్, కొలాం, కొలవార్, తోటి అనుబంధ సంఘాల ఆదివాసీలు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల

ముథోల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలమయమైంది. దీంతో విద్యార్థులు తరగతి గదులకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కళాశాల ముఖద్వారం వర్షపు నీటితో నిండిపోతుంది. విద్యార్థులు విద్యను అభ్యసించడానికి కళాశాలకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ఉప సర్పంచ్ సుభాష్, వీడిసి మాజీ అధ్యక్షులు నారాయణ, సాయినాథ్, భోజన్న గ్రామస్తులు కోరుతున్నారు.





నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
గత కొన్ని రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కాలువలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఎగువన కురుస్తోన్న వర్షాలకు జిల్లాలోని శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఇనోకు అనుగుణంగా అధికారులు 30 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున పర్యాటకులు ప్రాజెక్టు వద్దకు చేరుకొని ఆహ్లాదంగా గడుపుతున్నారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

## ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

### 30 గేట్లు ఎత్తి నీటి విడుదల







# సరిహద్దులో పొంగి పొర్లుతున్న వాగులు

## మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రాకపోకలు బంద్





**కుభీర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుభీర్ మండలంలో చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు నిండి ప్రవహిస్తున్నాయి. దీంతో మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని బెల్గాం తండా వద్ద లో లెవెల్ వంతెన కోత గురి కావడంతో దాని పైనుండి వరద నీరు ప్రవహిస్తోంది. ఈకారణంగా మహారాష్ట్ర, తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయాయి. వరదల వల్ల రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని బెల్గాం తండా వద్ద గల బ్రిడ్జి పై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నిఘ్వా, గోడపూర్, మార్లగొండ, కుభీర్ నుంచి పార్డి బీ వెళ్లే రహదారిలో ఒర్రెలు, వాగులు నిండిపోయాయి. ఎంపీడీవో సాగర్ రెడ్డి, ఎంపీవో మోహన్ సింగ్, ఎస్సై కృష్ణారెడ్డి, తహసీల్దార్ శివరాజ్, అధికారుల బృందం బెల్గమ్ తండా వద్ద బ్రిడ్జిని సందర్శించి పరిశీలించి సూచికలు ఏర్పాటు చేశారు. అవతలి పక్క గ్రామాల ప్రజలకు బ్రిడ్జి పైనుంచి ఎవరు వెళ్లొద్దని సమాచారం అందించారు. అన్ని గ్రామాల కార్యదర్శులకు అప్రమత్తంగా ఉండాలంటూ ఎంపీడీవో సాగర్ రెడ్డి ఎంపీవో మోహన్ సింగ్ అలర్ట్ చేశారు. పశువులను మేపేందుకు వెళ్లొద్దని, చేపలు పట్టేందుకు ఎవరు చెరువులు, వాగుల్లోకి వెళ్లవద్దని గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. వర్షాలు ఇంకా రెండు మూడు రోజులు కురుస్తున్నాయన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ఇల్లు కూలిపోయినా, ప్రమాదాలు జరిగిన సమాచారం చేరవేయాలన్నారు.



### ఉపాధ్యాయుడు ఇంట్లో
## వికసించిన బ్రహ్మ కమలం

**ఇచ్చోడ, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

అరుదుగా వికసించే బ్రహ్మ కమల పుష్పం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుని ఇంట్లో వికసించింది. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాంపల్లి కాంతయ్య గతంలో తన ఇంట్లో బ్రహ్మ కమలం మొక్కను నాటాడు. ఐతే ఆదివారం రాత్రి చెట్టుకు బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. సోమవారం ఉదయం వికసించిన బ్రహ్మ కమలం పుష్పాలను చూసి ఉపాధ్యాయుడు కాంతయ్య దంపతులు పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మ కమలం పుష్పాలను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి సతీమణి లక్ష్మీ మాట్లాడుతూ... తమ ఇంటిలో బ్రహ్మకమలం పూయడం చాలా ఆనందంగా ఉందన్నారు. సరిగ్గా మూడేళ్ల కిందట తమ ఇంటి పెరట్లో ఈ మొక్క నాటామన్నారు. తాజాగా బ్రహ్మకమలం విరబూసిందని ఆమె చెప్పారు. ఆ పుష్పాలను స్థానిక ఆలయానికి అందజేస్తామన్నారు. అరుదైన, ప్రత్యేకత కలిగిన పుష్పం తమ వీధిలో వికసించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# బీజేపీలో పలువురు చేరిక

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న ప్రజా సంక్షేమ అభివృద్ధికి యువత ఆకర్షితులై బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కంచుకోటకు చెందిన యువత మాజీ వార్డు సభ్యుడు చిప్ప చిట్టిబాబు ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. అరిగెల వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ రక్షణ కేవలం బిజెపితోనే సాధ్యమవుతుందన్నారు. పాకిస్తాన్‌తో పాటు ఇతర దేశాలు భారతదేశ అభివృద్ధిని ఓర్వలేక కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టే సత్తా ప్రధానమంత్రి మోడీకి ఉందని తెలిపారు. స్థానిక సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంస్థకతంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో



చేరిన వారిలో నాగ మణి, సురేష్, మహేష్, సాయి, కిరణ్, నాగేష్‌తో పాటు 40 మంది యువత ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ గౌడ్, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మహానీయుల ఆశయాల సాధనకు పాటుపడాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి పురస్కరించుకుని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు అదనపు కలెక్టర్ డేవిడ్, గౌడ సంఘం నాయకులు, వెనకబడిన తరగతుల సంఘాల నాయకులతో కలిసి హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయిల ఆగడాలను ఎదురించిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాన్నగౌడ్ అని అన్నారు. సౌకర్యాలు లేని రోజుల్లో సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని బహుజనుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. మహానీయుల ఆశయ సాధనకు మనమందరం ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి జీవన్, పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, నాయకులు శ్యాంనాయక్, ప్రణయ్ పాల్గొన్నారు.



### గురుకులాల్లో మెరుగైన
## విద్యను అందించాలి

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి వెంకటయ్య

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాల్లో మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి వెంకటయ్య సూచించారు. సోమ వారం కార్మిక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశా లను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల తో సమావేశ మై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌చైర్మన్ మాట్లాడుతూ బాలికలహాస్టల్ ప్రహారీ సోలార్ ఫెన్సింగ్ అమర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీగురుకుల విద్యాసంస్థలకు త్వరలోనే భవనాల నిర్మాణానికి నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. గురుకుల పాఠశా లల్లో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు రాబ ట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందిం చడంతో పాటు మెరుగైన విద్యను అందించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మనోజ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, నీలాదేవి, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గ ప్రసాద్, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ క్రిష్ణ పాల్గొన్నారు.

**వినాయక మండపం ఏర్పాటుకు ఇబ్బందులు కలిగించొద్దు**

పట్టణంలోని బూడిదగడ్డ భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న వినాయక మండపానికి అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ఎస్సీ, ఎస్టీ కమిషన్ వెంకటయ్య సూచించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు కూల్చిన వినా యక మండపాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వస్థలంలో ఏర్పాటు చేసుకున్న వినాయక మండపాన్ని భవిష్యత్‌లో ప్రభుత్వానికి అవసరం నిమిత్తం ఉపయోగించు కోవచ్చునన్నారు. వినాయక మండపం కూల్చివేతపై బస్తీ లోని దళితులందరూ వినతిపత్రం అందజేయాలని తెలిపారు. సమస్యలతో కూడిని వినతిపత్రాన్ని బస్తీ వాసులు అందజేశారు.

### ప్రజావాణి దరఖాస్తులను
## త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన మీరా రాణి మండల్ తన పేరిట గల లావుని పట్టా భూమిని తన తమ్ముడు పట్టా చేసుకున్నందున విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. మిత్ర సర్వీసెస్ మేనేజింగ్ పార్ట్నర్ కొండగుర్ల చంద్రశేఖర్ అవుట్ సోర్సింగ్ పోస్టులను



సమానంగా కేటాయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందని రైతులు తమ గ్రామం గుండా నాలుగు వరుసల రహదారి పక్కన ఖాళీ స్థలాలను ఆక్రమించు కున్నందున వ్యవసాయ చేనులో వస్తున్న వరద నీరు పోకుండా ఆగిపోవడంతో పంట నష్టం జరుగుతుందని, చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన పెంటన్న తన తండ్రి వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించినందున వారసత్వం ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశాడు. ఆసిఫాబాద్ మండలం వెకంటాపూర్ గ్రామానికి చెందిన పుల్లయ్య సాలెగూడ శివారులో అక్రమంగా పట్టా చేసిన వాటిని రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు తన పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని పట్టా చేసి పాసు పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్‌కు చెందిన పురుషోత్తం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# నిండుకుండల్లా జలశయాలు

- వర్షాలతో నిండిపోయిన చెరువులు, కుంటలు
- ఖరీఫ్, రబీ సాగుపై రైతన్నకు భరోసా
- ఆయా జిల్లాలలో పెరగనున్న భూగర్భ నీటిమట్టం

**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో అన్నదాతలు సంబరపడిపోతున్నారు. వానాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా భారీ వర్షాలు లేకపోవడంతో మొన్నటి వరకు సాగునీటి ప్రాజెక్టుల తో పాటు చెరువుల్లో నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. వరుణదేవుడు కరుణ కోసం జిల్లా రైతాంగం ఎదురు చూస్తున్న తరుణంలో ఈ భారీ వర్షాలు రైతులు సాగు చేసుకుంటున్నా ఖరీఫ్ రబీ పంటలకు పూర్తి భరోసా కల్పించనున్నాయి. నిర్మల్ జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులైన కడెం నారాయణరెడ్డి స్వర్ణ ప్రాజెక్ట్ గడ్డన్న శుద్ధ వాగు సదర్ సదర్ మార్ట్ శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటిమట్టం నిండాయి. ప్రస్తుతం శ్రీరాంసాగర్ మినహా మిగతా ప్రాజెక్టుల గేట్లను ఎత్తి మిగులు జలాలను వదులుతున్నారు. శ్రీరామ్‌సాగర్‌లో కూడా భారీ స్థాయిలో వరదరావడంతో రేపు గేట్లు ఎత్తి అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. శ్రీరామ్ సాగర్ పూర్తి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1087 అడుగులు చేరింది. 90 టీఎంసీలకుగాను 68 టీఎంసీలు చేరుకోగా గోదావరి పరిహాక ప్రాంతం నుండి లక్ష 50 వేల క్యూసెక్కుల నీరు వస్తుండడంతో మరో రెండు రోజుల్లో పూర్తి నీటి మట్టం నిండనుంది. కడెం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 695 అడుగులను నిలకడగా ఉంచుతూ 18 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. భైంసా గడ్డన్న గడ్డన్న శుద్ధ వాగు 358.60 అడుగులకుగాను పూర్తిస్థాయిలో నిండుకుంది. స్వర్ణ ప్రాజెక్ట్ 1183.26 అడుగులగాను పూర్తి స్థాయిలో నిండుకోగా గోదావరిపై నిర్మించిన సదరన్ ప్రాజెక్టులో కూడా నీటికల సంతరించుకుంది. ఈ ప్రాజెక్టులో రెండు రోజుల్లోనే భారీగా వరదరావడం ప్రాజెక్టు నిండిపోవడం రైతులను సంతోషం వ్యక్తం చేస్తుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద సరస్వతి కెనాల్ ద్వారా 36 వేల ఎకరాలు. కడెం ప్రాజెక్టు కింద 38000 స్వర్ణ ప్రాజెక్టు కింద 22,000 గడ్డం సిద్ధబాబు కింద 3000 ఆయకట్టు రైతులు తెలిపారు.

**అలుగు పారుతున్న చెరువులు...**
నిర్మల్ జిల్లాలోని చిన్న నీటి వనరులైన చెరువుల్లో భారీ వర్షాల కారణంగా చెరువుల్లోకి వరద వచ్చి చెరువులు నిండుకోవడంతో అలుగులు పారుతున్నాయి. జిల్లాలోని కడెం పెంబి సారంగాపూర్ మామడ కుబీర్ కుంటాల తానూర్ నర్సాపూర్ లక్ష్మణ చందా నిర్మల్ రూలర్ దిల్వార్పూర్ తదితర ప్రాంతాల్లో రెండు రోజుల్లో 130 మిల్లీమీట ర్ల మిల్లీమీటర్ల పైగా వర్షపాతం నమోదైనట్టు తెలిపారు. దీంతో అన్ని గ్రామాల్లో చెరువుల్లో నీరు నిండుకోవడంతో ఆయకట్టు కింద వరి సాగుకు పూర్తి భరోసా కరిగింది. జిల్లాలో 580 చెరువులు ఉండగా దాదాపు 476 చెరువులు అలుగు పారుతుండగా మిగతా చెరువుల్లో 80 శాతం నీరు ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ చెరువుల కింద సుమారు 50 వేల ఎకరాలు పంటల సాగు చేయనున్నారు ప్రస్తుతం కేవలం 0.70 మీటర్ల నీటి వృద్ధి నమోదయిందని అది సెప్టెంబర్ నాటికి రెండు మీటర్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టులు చెరువులు నిండడంతో వీటిపై ఆధారపడ్డ మత్స్యకారుల కూడా జీవనోపాధి పెరిగే అవకాశం ఉంది. నిన్న మొన్నటి వరకు ఆందోళనగా ఉన్న వారంతా ఇప్పుడు వర్షాలతో తమ కల నెరవేరి పోతుందన్న సంతోషం వ్యక్తమవుతోంది.



# భూమి విషయంలో దౌర్జన్యం

## ప్రాణహాని ఉందని బాధితుల ఆందోళన

**కాసిపేట, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
తమ సొంత భూమిని ఆక్రమించుకునేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్న వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కేంద్రానికి చెందిన జనప అల్లిక అనే మహిళ ఆందోళన వ్యక్తం చేసింది. శివారు సర్వే నెంబర్ 213 లోని రెండు ఎకరాల తమ భూమికి సంబంధించి సోమవారం ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి గోడును వెల్లబుచ్చుకుంది. భూమికి సంబంధిన పత్రాలు, సాగు తామే చేసుకుంటున్నామని వెల్లడించారు. డబ్బుల కోసం మల్లమ్మ అనే మహిళతో కలిసి భూమయ్య అనే వ్యక్తి తమ భూమిని ఆక్రమించాలని చూస్తున్నాడని ఆరోపించారు. వారి నుంచి తమకు ప్రాణ హాని ఉందని వాపోయారు. వారికి స్థానిక నాయకులు కుర్మ నర్సయ్య, లంక లక్ష్మణ్ అండగా నిలిచి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. భూమి గొడవకు సంబంధం లేని గ్రామ పెద్ద మనుషులు, మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, స్థానికులు రత్నం లక్ష్మణ్, గోమాస సుధాకర్, కవితపై తప్పుడు ఆరోపణలు చేశారని వెల్లడించారు. రెండెకరాల భూమి తమ సొంతమని, ఎవరికీ సంబంధం లేదని స్పష్టం చేశారు. తమను బెదిరిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

# మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
బహుజనుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు, పీడితులు ఏకమై ఎదురు తిరిగితే రాజ్యాధికారం సాధించవచ్చని ప్రజలను చైతన్య పరచిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. కుల, మత, వర్ణ విభేదాలు లేని సమాజం కోసం పోరాడేందుకు సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకుని బహుజన రాజ్య స్థాపన చేశాడని తెలిపారు. మహానుభావులను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. భావితరాలకు తెలిసే విధంగా మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు.

# వర్షాలు తగ్గుముఖం పట్టేంతవరకు అప్రమత్తంగా ఉండాలి



**నార్నూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. నార్నూర్ నుంచి గాదిగూడ వెళ్లే ప్రధాన రహదారి ఖడ్కి, లోకరికే, ధాబాకే కల్వర్టులపై వరద ప్రవాహంతో ప్రయాణికులు, వాహన చోదకులు వరద నీరు తగ్గే వరకు నిరీక్షించాల్సి వచ్చింది. వాగులు వంకలు జలమయ్య మయ్యాయి. పంట పొలాలలో భారీ వర్షపు నీరు చేరడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసుల శాఖల అధికారులు కోరారు. గడిచిన 24 గంటల్లో ఇంద్రవెల్లిలో46.4 మి.మీ, ఉట్నూర్‌లో 48.2 మి.మీ, నార్నూర్‌లో 40.0 మి.మీ, గాదిగూడలో 52.88 మి.మీ వర్షపాతం నమోదయింది.



# సర్దార్ పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాతరు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్దార్ పాపన్న గౌడ్ సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడని కలెక్టర్ పేర్కొన్నారు. కుల, వర్గ భేదాలు లేకుండా సమానత్వాన్ని నమ్మిన పాపన్న గౌడ్ బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి విశేష కృషి చేశారని తెలిపారు. రైతుల హక్కుల కోసం పోరాడి, ప్రజల్లో ఆత్మగౌరవం, ధైర్య స్ఫూర్తి నింపారని, పాపన్న గౌడ్ పేరు నేటికీ సమానత్వం, పోరాటస్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, సిపిఓ జీవరత్నం, డిటిఓ సరోజ, గౌడ సంఘం నాయకులు ముప్పం రామకృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో రవి ప్రతిభ

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
సీనియర్ కరాటే మాస్టర్ విజ్జగిరి రవి సిక్స్ డాన్ బెల్ట్ సాధించారు. 17వ తేదీన కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జాతీయస్థాయి కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీల్లో మాస్టర్ విజ్జగిరి రవి పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్- సిక్స్ డాన్ సాధించాడని కెనీ భూకాయ్ కరాటే ఇండియా ప్రెసిడెంట్ విజయం తెలిపారు. రవిని కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అభినందించారు.



# యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పత్తి, సోయా, వరి, మొక్కజొన్న వంటి పంటలకు ఆగస్టు నెలలో యూరియా అవసరం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాల వారీగా ప్రతిరోజూ యూరియా పంపిణీపై రిపోర్ట్ అందజేయాలని, ఎరువుల పంపిణీలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా విజిలెన్స్ మానిటరింగ్ కఠినంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. యూరియా కొరత రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో యూరియా కొరతలేదని, రైతులకు అవసరమైన ఎరువులు తగినంతగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డైవర్షన్ జరగకుండా బార్డర్ చెక్ పోస్టుల వద్ద పోలీస్, నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. రైతులకు ఎరువులు సులభంగా అందేలా షాపులను ఉదయం నుంచే తెరిచి ఉంచుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, సిపిఓ జీవరత్నం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దోమ.. వీటి కారణంగా సతమవతమవుతున్నా రా..? అయితే వీటికి విరుగుడు ఉంది తెలుసా..? డెంగీ, మలేరియా తదితర వ్యాధులు రాకుండా చేసుకోవ చ్చు కూడా! ఎన్ని మందులు వాడినా ఇవి పోవు కదా..? ఇలా చెబుతున్నారేమిటని ఆశ్చర్యపోతు న్నారు కదూ..! ఈ దోమ దరిచేరకుండా ఉండడానికి పలు మొక్కలు ఉన్నాయి.. ఇవి పెంచుకుంటే మీ ఇంటి సమీపంలోకి దోమలు రావండి.. ఇందుకు చేయాల్సిందల్లా మీ ఇంటిని వేదికగా చేసుకోవడమే. కుండీలు, ఖాళీ స్థలాల్లో ఈ ఔషధ మొక్కలు పెంచుకోండి. ఈ మొక్కలు పెంచుకుంటే ఇంటికి అందంతో పాటు ఇంటిల్లీపాదికీ ఆరోగ్యం కలుగుతుంది. ఈ మొక్కలేమిటి..? వాటి ఉపయోగాలేమిటనే వివరాలపై పత్యేక కథనం.

# ఇల్లే వైద్యాలయం.. మొక్కే ఔషధం

దోమలకు విరుగుడు
ప్రమాదకర వ్యాధుల నివారణ



జిల్లాలో వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.. వర్షాలు కురవకున్నా దోమల మోత మోగుతుంది.. వీటితో ప్రాణాంతక వ్యాధులకు గురై ఇపట్పికే జిల్లాలో 250 మందికి పైగా డెంగీ వ్యాధి బారిన పడ్డారు. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంది. జ్వరాల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య దాదాపు 30వరకు ఉంది. పాలమూరు జిల్లాలో ఇటీవల డెంగీ మరణాలు పెరిగాయి.. పరిస్థితి ఇంత విషమంగా ఉంటే పాలకులు నివారణా చర్యలు పట్టించుకోవ డం లేదు.. కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. దోమల నుంచి ఉపశమనం పొందడానికి ఎన్ని రకాల మం దులు వాడినా ఉపయోగం ఉండడం లేదు.. ఈ నేపథ్యంలో వ్యాధిని నయంచేసేకన్నా, నివారించడం మేలనేది అందరికీ తెలిసిన సత్యం. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా ఉండాలంటే అనాదిగా ఇళ్లలో పెంచుకొనే మొక్కలను తిరిగి పెంచాలి.

**దోమలు, నీటికాలుష్యం...**

దోమలు, నీటి కాలుష్యం కారణంగానే జ్వరాలు వస్తున్నాయి.. ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాలు పెద్దగా కురియలేదు.. భారీ వర్షాలు కురిస్తే మురుగు నీటి కాలువలు, గుంతల్లో దోమలు కొట్టుకుపోతాయి.. వర్షాలు తక్కువగా ఉన్నా దోమలు కొట్టు కుపోతాయి.. వర్షాలు తక్కువగాఉన్నా దోమల తీవ్రత మాత్రం ఇంకా తగ్గలేదు.. పైగా ఇళ్లలో వాడుకునే నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటుంది. దీంతో పాటు ప్రజలు అవగాహనా రాహిత్యంతో కొబ్బరి బోండాలు, టైర్లు, పూలకుండీలు, మంచి నీటి తొట్టెను యథాతథంగా వదిలివేస్తున్నారు. ఫలితంగా దోమలు ఉధృతమవుతున్నాయి.. మరుగుదొడ్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసే గొట్టాలకు పైభాగంలో తెరలు ఏర్పాటు చేయనందున దోమలు పెరుగుతున్నాయి..

**బాలలూ బహుపరాక్...**

పాలమూరు జిల్లాలో డెంగీ మరణాలను పరిశీలిస్తే... బాలలు గణనీయ సంఖ్యలో మృతిచెందారు. దోమలు బాలలపై దాడి చేయడం ఎక్కువగా ఉంటుంది. వీరు ఆటలాడి అలిసిపోయి ఇళ్లకు చేరుకుని నిద్రపోతుంటారు. ఆటలాడిన సమయంలో చెమట పోసినందున ఈ వాసనకు దోమలు వీరిని సులువుగా గుర్తుపట్టి దాడి చేస్తున్నాయి.. దీన్ని నివారించేందుకు వీరు నిద్రపోయేముందు స్నానం చేయాలి. వారానికి రెండుసార్లు తలస్నానం చేయాలి. దోమలు ముదురు రంగులను గుర్తుపడతాయి.. కాబట్టి లేతరంగు దుస్తులు ధరించాలి.

**వీటితో పాటు...**

నివాస గృహాల్లో ఉన్న మరుగుదొడ్లలో దోమలు నివాసముం టాయి.. వీటికి అక్కడ ఆశ్రయం లేకుండా చేసేందుకు, మరుగుదొడ్ల గొట్టాలకు దోమ తెరలు ఏర్పాటు చేయాలి. నివాస గృహాల సమీపంలో నీటి నిల్వలు లేకుండా చేయాలి. ఖాళీ కొబ్బరి బోండాలను పగులకొట్టివేయాలి. రబ్బరు టైర్లు, తదితర వస్తువుల్లో నీటినిల్వ లేకుండా చేయాలి.

## ఈ మొక్కలతో.. దోమలకు చెక్

**వేయి ఏనుగుల్ని తిన్న రాబంధు ఓ గాలి వానకే మృత్యువాత పడిన చందంగా ప్రమాదకర దోమల దండు కొన్ని మొక్కల వాసనతో అంతరించిపోతాయి.. బంతి, పుదీనా, రోజ్‌మేరీ, కలబంద, నిమ్మ గడ్డి, వెల్లుల్లి వాసనలు తగిలితే చాలు ఇవి పారిపోతాయి..**

## అమ్మో... ఎంతమందో..!

జిల్లాలో మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభించాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వ్యాధులతో ప్రజలు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా వైద్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పేద ప్రజలు మంచాలకే పరిమితమవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులకు ప్రత్యేక నిధులున్నా వాటిని సక్రమంగా ఖర్చు చేయడం లేదు. కొంతమంది ఈ పేరు చెప్పి నిధులు జేబుల్లో వేసుకుంటున్నారు. జిల్లాలో డెంగీ వ్యాధి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.. ఉన్నతాధికారులు కూడా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకు నిదర్శనమే నెల రోజుల్లో దాదాపు 10మందికిపైగా జ్వరాలతో ప్రాణాలు కోల్పోయారు. అయినా దోమలపై సమరం చేయడానికి సాహసించడం లేదు.

### రోజ్ మేరీ...



సూదుల్లాంటి ఆకులున్న రోజ్‌మేరీ సుగంధ మూలిక మొక్క.... దీన్ని ఎక్కువగా మాంసాహార వంటకాల్లో వినియోగిస్తుంటారు. ఈ ఆకుల్లో నుంచి వచ్చే సువాసన దోమలకు మాత్రం చెడువాసనగా ఉంటుంది.. దీంతో ఈ మొక్కలకు దోమలు చాలా దూరంగా ఉంటాయి.

### వెల్లుల్లి...



ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు.. దీని కారణంగా ఎన్నో వ్యాధులు నాయమవుతాయి.. దీని వాసన తగిలితే దోమలు తట్టుకోలేవు.. దీన్ని ఇంట్లో పెంచుకుంటే చాలు దోమల బాధ నుంచి విముక్తి పొందవచ్చు.

### తులిసి..



తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి.. ఈ మొక్క ప్రతి ఇంట్లోనూ పెంచుకోవడానికి వీలుం ది. తులసిని ఆయుర్వేద మందుల తాయరీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. దీనికి కొన్ని ఇళ్లలో పూజలు కూడా చేస్తారు. ఈ మొక్క నుంచి వెలువడే వాసనకు దోమలు పారిపోతాయి.

## మూడు రకాల దోమలే ప్రమాదకరం



- దోమల్లో 2500 రకాల జాతులున్నాయి..
- వీటిలో కులిసెడె కుటుంబానికి చెందిన ఈడిస్, క్యూలెక్స్, అనాఫిలిస్ దోమలే అత్యంత ప్రమాదకరం.. ఈ దోమలే ఇప్పుడు జిల్లాలో విలయాన్ని సృష్టిస్తున్నాయి..
- ఈడిస్ దోమ కాటుతో డెంగీ జ్వరం వస్తుంది.
- వీటిలో మగ దోమలు హాని చేయవు.. ఆడ దోమలే ప్రమాదం.. వీటితో వ్యాధులు త్వరగా సోకుతాయి..
- మానవశరీరంలో ఉండే రక్తంలో దోమల గుడ్లకు అవసరమైన
- దోమ ఒక్కసారి 200గుడ్లను పెడుతుంది. 48గంటల వ్యవధిలో ఇవన్నీ లార్వా దశకు చేరుకుంటాయి..
- ఇవి తమగుడ్లను మురికి గుంటలు, కాలువలు, నీటినిల్వ ఉండే ప్రాంతాల్లో పెడుతాయి.
- ఈ గుడ్లు ఐదువేల సంవత్సరాల వరకు తాజాగా ఉంటాయి..
- దోమలకు కంటి చూపు తక్కువగా ఉంటుంది.
- మనుషులు నిద్రించే సమయంలో వదిలే కార్బన్‌డయాక్సైడ్‌తో 60 అడుగుల దూరం నుంచి మనుషుల జాడను కనిపెడుతాయి.. వెంటనే కాటు వేస్తాయి.. ఈ సమయంలో వీటి లాలాజలం రక్తంలో కలిసిపోతుంది. అక్కడ నుంచి డెంగీ జ్వరం ప్రారంభానికి అవకాశం కలుగుతుంది.
- వాతావరణం వేడిగా ఉంటే దాడి చేయడం సులువు.
- మానవుల శరీరం నుంచి వచ్చే చెమట వాసనంటే వీటికి ఎంతో ఇష్టం. దీంతో మరింత రక్తం పీలుస్తాయి.

### బంతి...



బంతి పూలలో పైరిత్రమ్ అనే రసాయనం ఉంటుంది. క్రిమీసం హారక మందుల్లో దీన్ని వినియోగిస్తారు. ఈ పూలంటే దోమలకు పడదు.. బంతి పూల మొక్కలను కుండీల్లో ఏర్పాటు చేసి ఇంటి వాకిళ్లు, కిటికీల వద్ద ఉంచితే చాలు దోమలు పలాయనం చిత్తగిస్తాయి..

### పుదీనా...



తాజా పుదీనా వాసన గమ్మత్తుగా ఉంటుంది. ఈ ఆకుల్ని వంటల్లో వినియోగిస్తారు. ఈ ఆకుల్లో థైమాల్ అనే రసాయనం ఉంది. ఫంగస్, బ్యాక్టీరియాలను అరికట్టే శక్తి ఈ రసాయనంలో ఉంది. ఫలితంగా పుదీనా ఆకుల వాసనను దోమలు భరించలేవు.

### సిట్రోనెల్లా



స్థానికంగా నిమ్మ గడ్డిగా పిలిచే సిట్రోనెల్లా గడ్డిని ఇంటి ఆవరణలో ఎండ తగిలే ప్రదేశంలో పెంచుకోవడం ఎంతోమేలు... దీని నుంచి వెలువడే ఘాటైన నిమ్మ వాసన దోమలకు ఏమాత్రం పడదు. ఈ వాసన తగిలితేనే దోమలు దూరంగా వెళతాయి.

### కలబంద...



ఈ మొక్కను అనాదిగా ప్రతి ఇంటి ముంగిట్లో పెట్టుకొనేవారు.. దీని వాసనకు పలు క్రిములు ఇంట్లోకి రావు దీన్ని ఇప్పుడు మందుల్లో వినియోగిస్తున్నారు. అలాగే సౌందర్య సాధనల్లోనూ వాడుతున్నారు. అయితే ఇది దోమల నివారిణిగా చక్కగా పనిచేస్తోంది.



# ముంచెత్తిన భారీ వర్షాలు - స్తంభించిన జనజీవనం

- 3-4 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- చెరువులు, కుంటలకు జలకళ..
- జలాశయాలకు పోటెత్తుతున్న వరద
- నీటమునిగిన వందలాది ఎకరాల్లో పంటలు.



**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. ఆసిఫాబాద్ మండలంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన కురుస్తున్న బారీ వర్షాలకు పెద్ద వాగు, గూడెన్‌ఘాట్ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో, ఎగువన కురుస్తున్న వర్షాలకు కుమరంభీం ప్రాజక్టులోకి 52, 220 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో అరు గేట్లు పైకి ఎత్తి 51,667 క్యూసెక్కుల వరదనీటిని అదికారులు కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 3,600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు పైకి ఎత్తి 3,250 క్యూసెక్కుల వరద నీటినిఅధికారులు కిందికి వదులుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 గంటల్లో 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**సిర్పూర్(టి) :** సిర్పూర్(టి) సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగా సోమవారం ఉప్పొంగి ప్రవహించింది. హుడ్కిలి వంతెనతో పాటు పాటు వెంకట్రావుపేట-పోడ్సా వంతెనకు ఆనుకుని ప్రవహించడంతో మహారాష్ట్రకు రాక పోకలు నిలిపి వేశారు. వరద ప్రాంతాలను తహసీల్దార్ రహీముద్దీన్, డీఎల్‌పీవో ఉమర్ అహ్మద్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై కమలాకర్‌లతో పాటు రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎవరు వంతెన దాటవద్దని సూచించారు.

**వాంకిడి :** వాంకిడి మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, రహదారులు వరద నీటితో చెరువులు, కుంటలను తలపించాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ రోడ్డులో భారీగా వరద నీరు నిలిచి వాహనాలు నీట మునిగాయి. వరదనీరు కిరాణ, ఇతర దుకాణాల్లో చేరడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీ, లక్ష్మినగర్, ఇందిరానగర్ కాలనీల్లో ను వరద నీరు ఇళ్లల్లో చేరడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దిన్, కార్యదర్శి శివ వరద నీటిని తొలగించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలైన మార్కెట్ ఏరియా, శ్రీరాంనగర్ కాలనీల్లో వరదనీరు చేరింది. కాగజ్‌నగర్ పెద్దవాగులో ప్రవాహం అధిక మైంది. తహసీల్దార్ మధుకర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

**జైనూర్ :** జైనూర్ మండలంలో సోమవారం ఉదయం నుంయి ఎడ తెరపి లేకుండా వర్షం కురుస్తోంది. లేండిగూడ వాగు ఉప్పొంంగి ప్రవహిస్తుండడంతో ప్రజలు మండల కేంద్రానికి రాలేని పరిస్థితి నెలకొంది. లేండిగూడ వాగు వదరకు తహసీల్దార్ ఆడ బీర్షావ్ చేరుకుని పరిశీలించారు. ప్రజలు ప్రమాదకంగా వాగు దాటవద్దని సూచిచారు. ఆయన వెంట సిబ్బంది భరత్ తదితరులు ఉన్నారు.

**చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండల వ్యాప్తంగా సోమవారం వర్షం కురిసింది. ఉదయం వర్షం లేక పోవడంతో చేను పనుల నిమిత్తం రైతులు వ్యవసాయ కూలీలు చేనులకు వెళ్లి తిరిగి వచ్చారు. అయితే కేతిని- దిందా వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయినా దిందా గ్రామస్తులు ప్రమాదకరంగానే వాగును దాటారు. ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పని పరిస్థితుల్లో వాగు దాటారు.

**సిర్పూర్(యు) :** సిర్పూర్(యు) మండలంలో సోమవారం ఉదయం రెండు గంటలపాటు భారీ వర్షం పడింది. దీంతో మండలంలోని వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహించాయి.. సిర్పూర్(యు), దేవుడుపల్లి లోలేవల్ వంతెన, కోడ్డిగూడ, పాముడవాడ కల్వర్టు, శేట్టిహడ్నూనూర్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వాగులు దాటవద్దని అధికారులు సూచించారు.

# విద్యార్థి దశ నుంచి సాంస్కృతి, సాంప్రదాయాలు అలవర్చుకోవాలి







**నార్నూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** విద్యార్థి దశ నుంచే సాంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విట్టల్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో తీజ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో తీజ్ బుట్టలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాలు, సాంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ ఆడే విశ్వనాథ్, వార్డెన్ పవర్ వనిత, ఉపాధ్యాయులు వసంత్, శంకర్, రాజేశ్వర్, నీలయ్య, నూర్ సింగ్, రాజ్యలక్ష్మి, ప్రకాష్, రాజశేఖర్ ఉన్నారు.

**తీజ్ ఉత్సవాల్లో నృత్యం చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

నేరడిగొండ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన బంజారా తీజ్ ఉత్సవాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో కలిసి తీజ్ తెంపి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో కలిసి సాంప్రదాయ పాటలపై ఎమ్మెల్యే ఉత్సాహంగా నృత్యాలు చేశారు.



## అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠాపన

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** మండలంలోని చిర్రకుంట గ్రామంలో సోమవారం వేద పండితులు మనోహర శర్మ ఆధ్వర్యలో గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి అభయాంజనేయ స్వామి, ధ్వజ స్తంభంల ప్రతిష్ఠాపన చేశారు. ఈ పూజలో భాజపా సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు, ప్రముఖ వ్యాపారవేత్త ఉమేష్ యాదవ్, సావిత్రి, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ దంపతులు, వేణు దమతులు, శరత్‌లు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి,స్వామివారి ఆశీసులు పొందారు,అనంతరం భక్తులు భక్తి గీతాలతో భజన కార్యక్రమం చేపట్టారు

## కోతకు గురైనా కల్వర్టు

**మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** పట్టణంలో సోమవారం ఉదయం కురిసిన వర్షంతో వినూత్న కాలనీ-శ్రీశ్రీనగర్ మధ్య గల తోళ్లవాగుపై ఉన్న కల్వర్టు కోతకు గురైంది. కాలనీల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీ వాసులు కలెక్టరేట్ సమీపం నుంచి తిరిగి రావాల్సివస్తోంది. సీతారాంపల్లి రోడ్డులో ఎగువ నుంచి వరద ఎక్కువ రావడంతో ఒర్రె కల్వర్టుపై వరద ప్రవహిస్తోంది. కాలనీలోని కల్వర్టు వద్ద వరద ప్రవాహంలో గేదె కొట్టుకుని పోయి కొద్ది దూరంలో దిగువ ఒడ్డుకు చేరింది. ఇళ్లలోకి వరద నీరు వెళ్లకుండా చుట్టూ పక్కల ఒర్రె వద్ద చెట్ల పొదలు, పూడికను తొలగించే పనులను ఎక్స్‌కవేటర్ ద్వారా మాజీ చైర్మన్ వేణు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

## రక్తదానం.. ప్రాణదానం

### రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్



**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. రక్తదానం చేయడం ఎంతో ప్రాముఖ్యత కూడిందని ఆయన తెలిపారు. సభ్యులు పాలుపంచుకుని రక్తం అవసరం ఉన్న రోగులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రక్తదానం చేయడానికి ప్రోత్సహించాలని రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆనారోగ్య సమస్యలు రావని ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం చైర్మన్ గా నేరెళ్ల హనుమంతు వ్యవహరించారు. మరియు నిర్మల్ లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ యాదవ్ గారు మాట్లాడుతూ ఇలాంటి రక్తదాన శిబిరాలను మరిన్ని నిర్వహించి ప్రభుత్వానికి సహకరిస్తామని విన్నవించడం జరిగినది.

## బుగ్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ మాసంలో చివరి సోమవారం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, తమ మొక్కులు తీర్చుకుని శివలింగం వద్ద నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పిల్లలకు బోధన నైపుణ్యం వివరిస్తున్న ఎల్లన్న

**కుభీర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** ఈనెల 27 నుంచి వచ్చే నెల 10 వరకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో విద్యాబోధనపై నిర్వహించి జాతీయ కార్యశాల బ్యాగరీ ఎల్లన్న అనే ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. బైంసా మండలంలోని వానల్పాడు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఎల్లన్న పిల్లల్లో విద్య నైపుణ్యం బొమ్మలు ఆటపాటలతో కూడిన విద్య అనే అంశంపై కార్యశాల శిక్షకుడిగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం పదిమంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా నిర్మల్ జిల్లాకు చెందిన ఎల్లన్న ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



## కాలువ లీకేజీతో
## మురుగునీరు.. ప్రజల అవస్థలు

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి మున్సిపాలిటీ 31వ వార్డులో డ్రైనేజీ కాలువ లీకై రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేదని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## 'కూలీ'.. 200 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ!

సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'కూలీ' బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాన్ని అందుకొని దుమ్మురేపుతోంది. విడుదలైన నాలుగో రోజుల్లోనే రూ.200 కోట్ల దిశగా దూసుకెళ్తోంది. ఆగస్ట్ 14న విడుదలైన ఈ సినిమా, మొదటి రోజు వచ్చిన మిక్స్డ్ టాక్ ని తట్టుకొని ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'కూలీ' సక్సెస్ తో రజని ఫ్యాన్స్ సినిమా థియేటర్ల వద్ద పండగ చేసుకుంటున్నారు.ఈ సినిమా రిలీజ్ అయిన నాటి నుండి భారీ కలెక్షన్లను నమోదు చేస్తూ వస్తోంది. బాలీవుడ్ స్టార్‌లైన హృతిక్ రోషన్, జూ.ఎన్టీఆర్ నటించిన 'వార్ 2'(War 2)తో పోటీ ఉన్నా కూడా, 'కూలీ' మొదటి వారాంతంలోనే టాప్ కలెక్షన్స్ సాధించింది.'కూలీ' సినిమా నాలుగు రోజుల్లో దేశవ్యాప్తంగా రూ.193.25 కోట్లు వసూలు చేసింది. నాలుగో రోజు అయిన ఆదివారం ఒక్కరోజే రూ.34 కోట్లు వచ్చింది. శనివారంతో పోలిస్తే కొద్దిగా తగ్గిన కలెక్షన్ అయినా కూడా, మొత్తానికి భారీ వసూళ్లే సాధించింది.భాషల వారీగా చూస్తే, 'కూలీ' సినిమాకు తమిళ్ భాషలో అత్యధిక వసూళ్లు లభించాయి. తమిళనాడులో రజనీకాంత్‌కు ఉన్న క్రేజీ ఫాలోయింగ్ వల్ల, సినిమా అక్కడ భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. తెలుగు భాషలో కూడా సినిమా మంచి స్థాయిలో కలెక్షన్లు రాబట్టింది. హిందీ భాషలో మూడో స్థానంలో నిలిచిన ఈ సినిమా, నార్త్ లో కూడా హిట్ టాక్ తెచ్చుకొని ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కన్నడ భాషలో అయితే వసూళ్లు కొంచం తక్కువగా ఉన్నప్పటికీ, స్థిరంగా కొనసాగుతున్నాయి. అన్ని భాషలలోనూ సినిమా మంచి ఆదరణ పొందుతూ, బాక్సాఫీస్ వద్ద దుమ్ము దులుపుతోంది.



## లెహంగాలో పరమ్ సుందరి

కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా జాన్వీ లేటెస్ట్ ఫొటో షూట్ షేర్ చేసింది. ట్రెడిషనల్ అవతార్ లో జాన్వీ స్టన్నింగ్ లుక్స్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. ఈ పిక్స్ పై మీరును ఓ లుక్కేయండి. పాస్టెల్ రంగు లెహంగాలో జాన్వీ అందంగా ముస్తాబైంది. దానికి తగినట్లుగా భారీ ఎంబ్రాయిడరీ వర్క్ తో కూడిన హెవీ నెక్ లైన్ బ్లౌజ్ ని ధరించింది. సంప్రదాయం, ఆధునికతను కలగలిపి చూపురుల దృష్టిని ఆకర్షిస్తోంది. దుస్తులకు తగినట్టుగా, ఆమె ఒక స్టేట్‌మెంట్ నెక్లెస్, చెవిపోగులు ధరించారు. ఈ ఆభరణాలు ఆమె అందాన్ని మరింత పెంచాయి. అలాగే జాన్వీ తన మేకప్, హెయిర్ స్టైల్ ని చాలా కూడా సింపుల్‌గా, అందంగా ఉంచారు. జాన్వీ ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన క్షణాల్లోనే ఫుల్ వైరల్ అయ్యాయి. ఇవి చూసిన అభిమానులు, ఫ్యాషన్ ప్రియులు జాన్వీ స్టైల్, లుక్ ని మెచ్చుకుంటున్నారు.తన తల్లి శ్రీదేవిలాగే, జాన్వీ కూడా తన ప్రత్యేకమైన స్టైల్‌తో బాలీవుడ్‌లో ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా ఎదుగుతున్నారు. జాన్వీ ప్రస్తుతం తన నెక్స్ట్ ఫిల్మ్ పరమ్ సుందరి ప్రమోషనల్స్ లో బిజీగా ఉంది. ఈ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది జాన్వీ. ఈమెకు సోషల్ మీడియాలో మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు.



## కలిసిపోయిన విష్ణు, మనోజ్..

మంచు ఫ్యామిలీలో కొద్ది రోజులుగా వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంచు మనోజ్ తాజాగా చేసిన ట్వీట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అయితే కన్నప్ప' సినిమాతో వెండితెరకు పరిచయమైన మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ భక్త ఉత్తమ బాల నటుడిగా "సంతోషం ఫిల్మ్ అవార్డు అందుకున్నాడు". ఈ విషయాన్ని విష్ణు తన ఎక్స్ వేదికగా పంచుకోగా.. దీనికి మనోజ్ స్పదించారు. "కంగ్రాట్స్ అవ్రామ్.. నిన్ను చూస్తే చాలా గర్వంగా ఉంది! నువ్వు ఇలాగే జీవితంలో మరింత రాణించాలి నాన్న. మంచు విష్ణు అన్న, నాన్న మోహన్ బాబు గారితో కలిసి నువ్వు అవార్డు అందుకోవడం ఎంతో ప్రత్యేకం! ప్రేమతో బాబాయి అంటూ ట్వీట్ చేశారు మనోజ్. కొద్ది రోజులుగా వీరిద్దరూ మధ్య వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో మనోజ్ విష్ణు ట్వీట్ కి స్పందిస్తూ.. అన్నా అని సంబోధించడం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. దీంతో అభిమానులు.. విష్ణు-మనోజ్ మళ్ళీ కలిసిపోయారా? అని అనుకుంటున్నారు. అవ్రామ్ భక్త తన తొలి సినిమాకు అవార్డు గెలుచుకోవడంపై మంచు విష్ణు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టేజ్ పై మాట్లాడుతూ అంతా పరమేశ్వరుడి దయ అని అన్నారు. అలాగే అవ్రామ్ కూడా తనకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, అందరికీ కృతజ్ఞతలు అని తెలిపాడు. ఇందుకు సంబంధించిన ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఇది చూసిన మంచు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## రుక్మిణి వసంత్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్టు

బీర్బల్ మూవీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన, సప్త సాగరాలు దాటి సైడ్ ఎ, సైడ్ బి సినిమాలతో విపరీతమైన
క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ భారీ డిమాండ్
ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా రుక్మిణి ఎదిగారు. విజయ్ సేతుపతి సరసన ఏస్ సినిమాలో
నటించి కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి రీసెంట్ గానే కాంతార చాప్టర్1 షూటింగ్ లో జాయిన్
అయ్యారు.కాంతార1 తో పాటూ శివ కార్తికేయన్ తో కలిసి రుక్మిణి ఓ సినిమా చేస్తున్నారు. అది
కాకుండా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న
సినిమాలో కూడా రుక్మిణి హీరోయిన్ గా నటించనున్నారు. అయితే ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టులో
రుక్మిణి చోటు దక్కించుకుందనే విషయం ఆమెను మరోసారి వార్తల్లో నిలిపింది. అదే యష్ హీరోగా
వస్తోన్న టాక్సిక్. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల తర్వాత యష్ చేస్తున్న సినిమానే టాక్సిక్. గీతూ
మోహన్‌దాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. టాక్సిక్ కోసం
ఇప్పటికే పలు భాషల నుంచి స్టార్లను తీసుకోగా ఇప్పుడు కన్నడ ఇండస్ట్రీ నుంచి రుక్మిణి కూడా
తోడైనట్టు తెలుస్తోంది. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా లాంటి
భారీ తారాగణంతో పాటూ రుక్మిణి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. టాక్సిక్ లో రుక్మిణి నటిస్తుందనే
విషయాన్ని మేకర్స్ ఇంకా అధికారికంగా అనౌన్స్ చేయకపోయినప్పటికీ ఇప్పటికే ఈ సినిమా
కోసం రుక్మిణి పలు షెడ్యూళ్ల షూటింగ్ ను కూడా పూర్తి చేశారని శాండిల్‌వుడ్ వర్గాల నుంచి
లీకులందుతున్నాయి. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో సమాంతరంగా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా వచ్చే
ఏడాది మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# భారీ వర్షాల నష్టంపై నివేదికలు సిద్ధం చేయాలి : కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై విభాగాలవారీగా పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, పంటలు, నివాస గృహాలు దెబ్బతిన్న ప్రాంతాలను తక్షణం సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రహదారులు, వంతెనలు, దెబ్బతిన్న చోట్ల వెంటనే మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. వైద్య శాఖ అధికారులు ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజక వర్గాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు పంటల నష్టంపై సమగ్ర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఆమె ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జెడ్పీ సీఈఓ గోవింద్, సిపిఓ జీవరత్నం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యాన వన శాఖ అధికారి రమణ, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి రాజేందర్ పాల్గొన్నారు.





## అంగన్వాడీల సమస్యలు
# పరిష్కరించాలని ధర్నా

నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను బలహీనం చేసేనందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని వారు ఆరోపించారు. వేతనాలు పెంచాలని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పోషకారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మృతి పత్రాన్ని ఏవో సూర్యారావుకు అందించారు.

## శివాలయాల్లో భక్తుల పూజలు



నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లాలోని వివిధ శివాలయాలు శ్రావణ చివరి సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. జిల్లాలోని కదిలి పరమేశ్వర ఆలయంతో పాటు సిద్దిలకుంట సూర్యాపూర్ ఓలా చీరాల ముధోల్ బ్రహ్మేశ్వర్ రాజేశ్వర ఆలయం వెయ్యి లింగాల గుడి టెంపుల్ శివాలయం తదితర ఆలయాలు ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూలైన్లు కట్టారు. శివలింగాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## పేకాడుతున్న ముగ్గురిపై కేసు

బెజ్జూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
టాస్క్ ఫోర్స్ పోలీస్ బృందం సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్ సమీపంలో అక్రమంగా కార్డులు ఆడుతున్న ముగ్గురిని పట్టుకొని, వారి వద్ద నుండి రూ.26,470/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం. సిర్పూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన బింగినేని తిరుపతి, రాజు, మహేష్ అదుపులోకి తీసు కొని విచారిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ 26470 లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిర్పూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన తెలిపారు. మరో ఆ రుగురు తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఐ రాజు హెడ్ కానిస్టేబుల్ మహమూద్, పిసిలు విజయ్, మధు, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.



## 23, 24 తేదీలలో రాష్ట్ర స్థాయి
# బాల్ బాడ్మింటన్ పోటీలు



కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
ఈ నెల 23, 24 తేదీలలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాగజ్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 25 నుండి 28వ తేదీ వరకు తమిళనాడులోని దిండిగల్ లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు తెలంగాణాలోని ఉమ్మడి పది జిల్లాల పురుషులు, మహిళలకు సంబంధించిన 20 జట్లు హాజరు కానున్నాయని, ఇందుకు గాను గోలేటిలో పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు గోలేటిలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. పోటీల విజయవంతానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు, జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి
# పోలీస్ ప్రజావాణి

నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
ప్రజలకు ఏ సమస్య ఏర్పడ్డ పోలీస్ శాఖకు సంప్రదిస్తే దాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ జానక షర్మిల తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో పోలీసు ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి వచ్చిన అర్జులను స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మల్ జిల్లాలో వినాయక చవితి పండుగలు నేపథ్యంలో డీజేల విషయంలో ప్రతి ఒక్కరు కూడా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటి స్తూ శబ్దాలను నియంత్రించుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పండుగలు ఉత్సవాల్లో పరిమితికి మించి డీజిల్ వాడితే వారిపై చర్యలు తీసుకుంటామని సామాగ్రిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. డీజేలు ఉపయోగించేవారు ముందుగా పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ రాకేష్ మీనా అవినాష్ కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.





## జాతీయ రహదారిపై
# బోల్తాపడ్డ పప్పు దినుసుల లారీ

తాండూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టం జరుగలేదని పోలీసులు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని మాచర్ల నుంచి చత్తీస్‌గఢ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు వెళ్తున్న కందిపప్పు లారీ డ్రైవర్ తాండూర్ పెట్రోల్ బంక్ సమీపం హోటల్ వద్ద భోజనానికి ఆపుతున్న క్రమంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. విషయం తెలుసుకున్న తాండూరు ఎస్సై కిరణ్‌కుమార్ , పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

## సాక్షిని బెదిరించిన కేసులో ఒకరి అరెస్ట్

ఇచ్చోడ, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
మర్డర్ కేసులో ప్రత్యక్ష సాక్షి అయిన మమ్మద్ అలీ అనే వ్యక్తిని బెదిరించిన వనాలే పాండురంగ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వనాలే పాండురంగ అనే వ్యక్తి 2023 వ సంవత్సరంలో జరిగిన ఓ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు ఆ కేసులో ప్రధాన సాక్షి అయిన మమ్మద్ అలీ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి అతనిని బెదిరించి అతని కుటుంబ సభ్యులందరినీ చంపివేస్తానని బెదిరించినట్లు బాధితుడు మహమ్మద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా కానీ సాక్షులను ప్రలోభ పెట్టినట్లయితే వారి పైన కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఇచ్చోడ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

## నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు

ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 22 వరకు పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్క డక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, భోజనం నాణ్యత, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించాలని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా ప్రత్యేక దృష్టి సారించి వారి తల్లితండ్రులతో ఉపాధ్యాయులు మాటాడాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట విద్యాశాఖాధికారి ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గోల్కొండపై తొలి జెండాను ఎగరవేసిన ధీరుడు పాపన్నగౌడ్

## జయంతి వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం కోసం 17వ శతాబ్దంలోనే పోరాడిన అసమానమైన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నా రు. పాపన్నగౌడ్ 375వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పార్టీ నేతలు, గౌడ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోగు రామన్న మాట్లాడుతూ మొగ ల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గోల్కొండ ఖిల్లాంద తొలి జెండాను ఎగరవేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. ఆ పోరాట యోధుల్ని స్ఫూర్తిగా తీసుకొని అనగారిన వర్గాల అభివృద్ధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆనాడు బీసీ కులాలు అస్పృశ్య తకు గురవుతున్న రోజుల్లో వారికోసం అండ గా నిలిచి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు ఎస్సీ ఎస్టీ బీసీ వర్గల్లో సామాజిక స్పృహ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, బీసీ సం ఘం, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల వల్ల ఏ ప్రమాదం సంభవించిన వెంటనే పోలీస్ లకు సమాచారం అందించాలని, ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో పోలీస్ అధికారులను, సిబ్బందిని సిద్ధం చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై గాని, ఇతర ప్రదేశాలలో గాని సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కలిగే ప్రమాదాలపై తక్షణ స్పందన కలిగే విధంగా పోలీస్ అధికారులను సిద్ధం చేశామని తెలిపారు. వాగులు, చెరువులను అనుకోని ఉండే ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, పశువులు కాపరులు వాగులు, వంకల వైపు వెళ్లరాదని, గ్రామాలలో కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు గస్తీ పోలీసులను అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్-100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670551 కు సమాచారం అందించగలరని కోరారు. పోలీస్ శాఖ తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతుందని తెలిపారు.

**జిల్లా ప్రజలకు పోలీస్‌ల విజ్ఞప్తి...**
నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలి...

- వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలను, గోడలను తాకరాదు, వాటికి కరెంట్ షాక్ తగిలే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు.
- ఇనుప వైర్లపై బట్టలు ఆరబెట్టరాదు.
- ఇంటి పైకప్పు ఇనుప రేకులను తాకరాదు.
- శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, మట్టి గోడల ఇండ్లలో ఉండరాదు.
- రైతులు బావులు, బోర్ల వద్ద స్టార్టర్ బాక్స్‌లు, ఫ్యూజ్ బాక్స్‌లను తాకరాదు.
- వరద నీటితో చెరువులు నిండిపోవడం వల్ల చెరువు కట్టలు తెగిపోవచ్చు. అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.
- చిన్నపిల్లలు, ఈత రాని వారు చెరువుల్లో ఈతకు లేదా చేపల వేటకు వెళ్లరాదు.
- వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షం వల్ల రహదారులు దెబ్బతిన్న గుంతలు ప్రమాదకరంగా మారవచ్చు.
- డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండే అవకాశం ఉంది, జాగ్రత్తగా నడవండి.
- వర్షాల కారణంగా కల్వర్టులు, చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తే వాహనాలతో దాటకండి.
- అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దు.
- వాటర్‌ఫాల్స్ సందర్శన చేయవద్దని సూచించారు.

# భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



**జైపూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ఐకెపి మహిళలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్హెచ్ సభ్యులు డి మాండ్ చేశారు. సోమవారం సుమారు 300 మంది స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. గతంలో మహిళల సమావేశాల కోసం అప్పటి ఎమ్మెల్యే ఆదేశాలతో తహసీల్దార్ గ్రామ సంఘానికి సర్వే నంబర్ 152లో స్థలం కేటాయించారని, కానీ కొందరు నాయకులు, స్థానికేతరులు దానిని ఆక్రమించి 10 గుంటల చొప్పున ఆక్రమించి బంధువులకు విక్రయించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ ఎంక్వైరీ పేరుతో కాలయాపన చేస్తూ, మహిళల వినతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జైపూర్ గ్రామ సంఘ స్థలంలోనే మహిళా ఇందిరా భవన్ నిర్మాణం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని మహిళా సంఘాలు విజ్ఞప్తి చేశాయి.



బంగారం నిధులున్నాయని

# నమ్మించి మోసం

**లోకేశ్వరం, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
మీ ఇంట్లో బంగారం నిధులు ఉన్నాయి. వాటిని క్షుద్ర పూజలు చేసి బయటకు తీస్తానని మహిళకు మాయ మాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తిని సోమవారం అరె స్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ముధోల్ సీఐ మల్లేష్ తెలిపారు. లోకేశ్వరం మండలంలోని భామ్ని(కె) గ్రామానికి చెందిన బాయి భోజక్క వద్దకు సిరిసిల్ల జిల్లా కు చెందిన రాజేందర్ అనే వ్యక్తి వచ్చి మీ ఇంట్లో గుప్త నిధులున్నాయి. వాటిని పూజలు చేసి బయటకు తీస్తా ను. అందుకు డబ్బు ఖర్చు అవుతుందని చెప్పాడు. అత ని మాయమాటలు నమ్మిన భోజక్క రూ.22,000 ఇవ్వ గా పూజలు చేస్తున్నట్లు నటించి బంగారం కూడా అక్క డ పెట్టి పూజ చేయాలని నమ్మించాడు. దీంతో ఆమె 20 గ్రాముల బంగారం సైతం అతనికి ఇవ్వగా పూజ చేస్తున్నట్లు నటించి మళ్లీ వస్తానని చెప్పి బంగా రంతో పాటు ఉడాయించాడు. ఆ తర్వాత నేరస్థుడు మళ్లీ ఆమె కు ఫోన్ చేసి రూ.1,50,000 ఇస్తేనే నిధి బయటకు తీస్తానని చెప్పగా ఆ మహిళ మోసపోయి నట్టు గ్రహిం చి లోకేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేసిన ట్లు తెలి పారు. ఆ డబ్బులు ఇస్తానని ఇంటికి రావాలని చెప్పగా నేరస్థుడు సోమవారం బామ్ని(కె) గ్రామానికి వస్తున్నట్లు చెప్పడంతో ఆ మహిళ లోకేశ్వరం ఎస్సై కి సమాచారం ఇవ్వగా ఎస్ఐ సిబ్బందితో పాటు మాటు వేసి నిందితు న్ని పట్టుకున్నట్లు తెలిపారు. బంగారు గొలుసు, ఒక ఉంగరం, కారు, పూజ సామగ్రి స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

# వరద సాయంపై ప్రభుత్వం స్పందించాలి



## నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో వర్షాలు వరదల వల్ల నష్టపోయిన ప్రజలను రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పి నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని వరద ముంపు ప్రాంతాలను సం దర్శించి బాధితులకు అన్ని విధాల అండగా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకో వాలని సూచించారు. బీఎన్ఆర్ కాలంలో వరద ముంపు రాకుండా చెక్‌డాం కూల్చి వేయడం జరిగింది అన్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 29 దేవాలయాలకు నిధులు మంజూరయ్యాన్ని మొదటి విడతలో 13 దేవాలయాలకు పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గం ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటికీ వందల కోట్ల రూపాయలను తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రావుల రామనాథ్ పద్మ రమేష్ ముత్తెన రెడ్డి రాజు సాయి కార్తీక్ తదితరులు ఉన్నారు.

# వృద్ధురాలిపై అత్యాచారం కేసు.. నిందితుడు అరెస్టు

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గుడిహత్నూర్ మండలం మల్కాపూర్కు చెందిన మడావి నగేష్ అలియాస్ నాగోరావు(25) ఈ నెల 8న ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ కూడలి సమీపంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న వద్దురాలిపూ అత్యాచారం చేశారు. వృద్ధురాలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 14న మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు 8న తెల్లవారుజామున రైలులో పరారైనట్లు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. అనుమానిత నిందితుడి ఫొటోను పోలీ సులు విడుదల చేసి ఆచూకీ తెలిపిన వారికి భారీ బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. ఎట్టకేలకు నిందితుడిని ఆదిలాబాద్‌లో తిరుగుతున్న అదే పోలికలున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

# యువకుడి బలవన్మరణం

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
జీవితంపై విరక్తి చెంది ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన షేక్‌అజ్మత్ (20) తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నద మ్ములు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దీంతో ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తున్న అజ్మత్ ఒంటరిగా తనం భరించలేక జీవితంపై విరక్తిచెంది. ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు : ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో దూరం నుండి వచ్చి గ్రీవెన్స్ సెల్ లో అందించే అర్జీలను పెండింగ్ పెట్టవద్దని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమ వారం ఉట్నూర్ లోని ఐటీడీఏ పీఓ ఛాంబర్ గ్రీవెన్స్ సెల్ లో పీఓ పాల్గొని గిరి జనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. గిరిజనులు ఆయా సమస్యలపై పీఓ కు విన్నవించి అర్జీలు అందించారు. ఉట్నూర్‌లోని రాజుగూడ గ్రామానికి చెందిన రాథోడ్ వికాస్ తన ఉన్నత చదువుల కోసం ల్యాప్ ట్యాప్ మంజూరు చేయాలని, ఐటీడీఏ కార్యాలయ డీడీ విభాగంలోని 4వ తరగతి ఉద్యోగస్తులకు ఏకరూప దుస్తులు ఇప్పించాలని, మందమర్రికి చెందిన అమృత తాను సాగు చేసుకునే పోడు భూమికి ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఇవ్వాలని, ఇచ్చోడలోని దుబాయ్ పేట్ గ్రామానికి చెందిన మహేందర్ తనకు ఏదైనా ఉద్యోగం అవకాశం కల్పించాలని, ఉట్నూరు మండలం ఉమ్రి గ్రామానికి చెందిన ఆత్రం అయ్యుబాయి తనకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు మంజూరు చేయాలని, జైనూర్ మండలం శివనూర్ గ్రామానికి చెందిన ధనుష్ గురుకులం కళాశాలలోని అడ్మిషన్ కావాలని వేరు వేరుగా అర్జీలు పెట్టుకున్నారు. ఐటీడీఏ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాగుకు అవసరమైన యూరియాను

# ప్రణాళికబద్ధంగా రైతులకు అందించాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో పంట సాగుకు అవసరమైన యూరియా ప్రక్కదారి పట్టకుండా ప్రణాళికబద్ధంగా రైతులకు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో యూరియా నిల్వలు, సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న యూరియాను వ్యవసాయ సాగుకు అవసరం మేరకు ప్రణాళికబద్ధంగా రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జూలై, ఆగస్టు మాసాలలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున యూరియా వాడకం పెరిగిందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు ఈ నెల ఆఖరు వరకు అవసరం మేరకు పొదుపుగా రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాలోని ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను తనిఖీలు చేసి, ప్రతి రోజు స్టాకు వివరాలను సమర్పించాలని, యూరియా ప్రక్క దారి పట్ట కుండా




జిల్లాలో టాస్క్ ఫోర్స్ కమిటీలను నియమించి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీలర్ల షాపులలో నిల్వలు, ధరల వివరాలు ప్రదర్శించాలని, కొనుగోలు చేసిన రైతులకు సంబంధిత రశీదు తప్పకుండా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ రోజు వరకు 28,816 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందనీ ఆన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1965 మెట్రిక్ టన్నుల యూరియా, మార్క్ఫెడ్, సొసైటీలు ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో గలదు. రైతులు యూరియా అందుబాటు గురించి ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఇంకొక ముఖ్య గమనిక ఏంటంటే యూరియాని ఎవరైనా గాని పక్క రాష్ట్రాలకు గాని వ్యవసాయనికి కాకుండా ఇతర అవసరాలకు గాని వినియోగించినట్లు దృష్టికి వస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం




జరుగుతుందన్నారు. కనుక తమ యొక్క పట్టా పాస్ బుక్ అనుగుణంగా మాత్రమే యూరియాని కొనుగోలు చేయాలని యూరియాని ఒకేసారి కాకుండా, ధఫ దఫాలుగా వాడాల్సి ఉంటుంది కనుక, ఈ దఫా కు అవసరమైన యూరియా మాత్రమే కొనుగోలు చేయవలసిందిగా కోరారు., తర్వాత దపాలకు అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎలాంటి యూరియా కొరతలేదన్నారు. జిల్లాలో ఈ రోజు వరకూ యూరియా ముగింపు నిల్వలు ప్రైవేట్ దుకాణాలలో 241.775 మెట్రిక్ టన్నులు ఉండగా 120.376 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని పాల్గొన్నారు.

# దిండా రైతులతో ఎమ్మెల్సీ, అధికారుల చర్చలు



**చింతలమానేపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

చింతలమానేపల్లి మండలం దిండా గ్రామానికి చెందిన పోడు భూముల రైతులతో సోమవారం ఎమ్మెల్సీ దండె విఠల్, కాగజ్‌నగర్ ఎల్డీవో సుశాంత్ బొగాడే చర్చలు జరిపారు. ఖర్జెల్లి అటవీ రేంజ్ అధికారి కార్యాలయంలో పోడు రైతులతో సమావేశమయ్యారు. దిండా రైతులకు ఎల్డీవో అటవీ చట్టాల గురించి వివరించారు. ఒక్కో రైతుకు ఎంత భూమి ఇవ్వాలనే విషయంపై అంగీకారానికి రావాలని సూచించారు. రైతులు మాట్లాడుతూ తమకు గతంలో ఇస్తానని ప్రకటించిన భూమికి తోడు అదనంగా మరో 250 ఎకరాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో 330 రేషన్ కార్డులు ఉండగా, మరో 20 కుటుంబాలకు లేవని తెలిపారు. మొత్తం 350 కుటుంబాలకు భూములు ఇవ్వాలని కోరారు. ఐదెకరాల కంటే తక్కువ ఉన్న రైతులకు యథాస్థితిని కొనసాగించాలని, ఎక్కువ ఉన్న రైతులకు మాత్రం ఐదెకరాలు ఇచ్చి మిగతా భూమిని తీసుకునేందుకు అంగీకరిస్తామని పేర్కొ న్నారు. ఎల్డీవో మాట్లాడుతూ రైతులకు నిబంధనల మేరకు మూడెకరాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతులు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని అటవీ అధికారులకు సూచించారు. నాలుగెకరాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎఫ్ఎర్వో సుభాష్, కౌటాల సీఐ సంతోష్, జెడ్పీ మాజీ చైర్మన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాలు జరగకుండా

# అప్రమత్తంగా ఉండండి

**నిర్మల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలను చేపట్టడం జరిగిందని జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సలియా నాయక్ తెలిపారు. ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు స్తంభాలు వేలాడుతున్న విద్యుత్ తీ గల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూ చించడం జరిగిందన్నారు. ప్రజలు విద్యుత్ ప్రమా దకరంగా ఉన్న ప్రదేశానికి వెళ్లవద్దని ఏదైనా సహాయం కోసం విద్యుత్ శాఖ 1912 టోల్ ఫ్రీ నెంబర్ను సంప్రదిస్తే విద్యుత్ సిబ్బంది వారికి అన్ని విధాల సహకారం అందిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీ ఎంపీటీసీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం సమస్యల పరిష్కార వేదిక నిర్మిస్తున్నట్లు డి ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో విద్యుత్ సంబంధించిన ఏ సమస్య అయినా ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు ఉంటాయని, అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గుండెగాం గ్రామాన్ని

# సందర్శించిన ఎస్పీ జానకీ షర్మిల

**ముథోల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని గుండెగాం గ్రామాన్ని సోమవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్లాగ్ వాటర్‌తో గ్రామ రోడ్లన్నీ జలమయ మయ్యాయి. గ్రామం మీదుగా మహాగాం, పార్టీ(బి) గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు గ్రామంలో వచ్చి చేరడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ బ్యాక్ వరద నీటితో గ్రామస్తులు పడుతున్న ఇక్కట్లను, పరిస్థితులను అక్కడి ప్ర జలతో మాట్లాడి, పరిస్థితిని సమీక్షించారు.



## మహనీయుల ఆశయాల

# సాధనకు పాటుపడాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి పురస్కరించుకుని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు గౌడ సంఘం నాయకులు, వెనకబడిన తరగతుల సంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయిల ఆగడాలను ఎదురించిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాన్న గౌడ్ అని అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రజల సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు.



# విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ముథోల్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**



తానూరు మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రజక, బీసీ, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం ర్యాలీగా వెళ్లారు. సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసినవారిని వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విగ్రహం స్థానంలో నూతనంగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. నాయకులు సుంకెట పోశెట్టి, మహేశ్, నందు, దిగంబర్, సాయి, దిలీప్, శంకర్, ఆనంద్, దేవిదాస్ హస్తే పాల్గొన్నారు. అదే విధంగా తానూరు మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్ర హాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మున్నూరుకాపు తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని బోసి గ్రామాన్ని సోమవారం సందర్శించి గ్రామస్తులతో వివరాలను తెలుసుకున్నారు. రజక, బీసీ, ఇతర సంఘాల నాయకులు మైన విగ్రహ స్థానంలో కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. సభ్యులు తోట రాము, చుక్క బొట్ల భోజన్న, భైంసా ఆత్మ చైర్మన్ సిద్ధవార్ వివేకానంద, నాయకులు అనిల్, నాగనాథ్, గోపాల్, మాణిక్ దాస్ ఉన్నారు. కుంటాల మండలంలో.. బోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్ర హాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షిం చాలని కోరుతూ రజక సంఘం సభ్యులు తహ సీల్దార్ కమల్సింగ్కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు పథకంటి దత్తాద్రి, సిబ్బిల దత్తు, కాశీరాం గజేందర్, ఆలూరు ప్రవీణ్, ఎ.గజ్జా రాం, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ అతలాకుతలం

### ఎడతెరిపిలేని వర్షాలతో వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు- తెగిన రోడ్లు, నిలిచిన రాకపోకలు

# చినుకు వదలదు.. వరద కదలదు

- ఉమ్మడి జిల్లాలో మూడో రోజూ వర్ష బీభత్సం..
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట చేలు
- లో లెవల్ వంతెనపై పారుతున్న వరద నీరు..
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు.. వంకలు..
- కోతకు గురైన వంతెనలు, ప్రధాన రహదారులు..
- అనేక గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 ఎత్తి దిగువకు నీటి విడుదల..
- ఉగ్రరూపం దాల్చిన ప్రాణహిత, పెన్‌గంగ నదులు
- వరదతో మహారాష్ట్రకు నిలిచిపోయిన రాకపోకలు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- పంట నష్టం అంచనాలో జిల్లా అధికార యంత్రాంగం
- నేడు జిల్లాకు రానున్న ఇంచార్జీ మంత్రి జూపల్లి ఉమ్మడి జిల్లాలో పర్యటన..

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కు రుస్తున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా జన జీవనం అతలాకుతలం అవుతున్నది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని వికలాంగుల కాలనీ, ధోబి కాలనీలలో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. జైనథ్, బేలా తాంసి, తలమ డుగు భీంపూర్, బోథ్, సిరికొండ ఇచ్చోడ మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోథ్ మండలంలోని ధన్నూర్ (బి) గ్రామంలో భారీ వర్షానికి పలు పంట కులాల్లోని పత్తి పంట నీట మునిగింది. భీంపూర్ మండలం లోని నిపాని గ్రామానికి సమీపంలో ఉన్న రెండు వంతెనల పై నుంచి వరద నీరు ప్రవహించడంతో మండలంలోని 20 గ్రామా లకు రాక పోకలు నిలిచిపోయాయి. కప్పర్ల పాఠశాలలో చదివే నిపాని విద్యార్థులు భారీ వర్ష సూచనతో ముందుగా ఇళ్లకు పంపిం చారు. తిరుగు ప్రయాణంలో వరద ఉధృతితో విద్యార్థులు ఉదయం 10.30 నుంచి 3 గం టల వరకు గ్రామానికి అర కిలోమీటర్ దూ రంలోనే నిలిచిపోయారు. మధ్యాహ్నం ఉధృతి తగ్గడంతో ఇళ్లకు చేరుకున్నారు. అదేవిధంగా నిపాని గ్రామంలో వర్షం దాటికి బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురైంది. మండలంలోని పిప్పల్ కోటిలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. తాంసి మండల కేంద్రంలోని హను మాన్ ఆలయం వద్ద వాగు ఉప్పొంగి ప్రవ హించింది. మత్తడి వాగు ప్రాజెక్టు వరద ఉధృతి పెరగడంతో 2 గేట్లు ఎత్తి 4920.0 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ వరద ఉధృతి పెరగడంతో అధికారులు 2 గేట్లను ఎత్తి దిగువకు వీటిని వదిలా రు. జైనథ్ మండలంలోని తర్నం వాగు పై ఉన్న తాత్కాలిక లోలేవల్ వంతెన పైనుండి వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలు నిలిపివేశారు. దీంతో జాతీయ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర భారీగా వాహ నాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## ఉప్పొంగిన ప్రాణహిత, వార్ధా నదులు



**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వార్ధా, ప్రాణహిత నదు లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిర్పూర్(టీ) సమీ పం లోని హుడిలికి వద్ద వంతెనపైకి వరద పొంగడంతో మహా రాష్ట్రకు రాకపోకలు నిలిచాయి. కౌటాల మండలం లోని తాటిపల్లి వద్ద వార్ధా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పు ష్కర ఘాట్‌లు మునిగిపోయాయి. పోలీసు కంట్రోల్ రూం నంబర్ 8712670551కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. రెబ్బెనలోని ఎన్‌టీఆర్ కాలనీలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలు, ని వాస సముదాయాలు పరిశీలించారు. దహెగాం, హత్తిని, ఐనం, పెసర్‌కుంట గ్రామాల్లో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పర్యటించారు. సోమవారం తెల్లవారు జాము నుంచి ఉద యం 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో మంచిర్యాల పట్టణం జలమయంగా మారింది. 42.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. టూటౌన్ ఏరి యాలోని హమాలీవాడ, సూర్యనగర్, బృందావన్ కాలనీ, సీతారామ కాలనీ, సాయికుంట, తిరుమలగిరి, ఎన్టీఆర్ నగర్, గర్మిళ్ల, స్టేషన్‌రోడ్, కాలేజీరోడ్ ప్రాంతాలు నీట ము నిగాయి. మంచిర్యాల ఏసీసీ నుంచి ర్యాలీగఢ్‌పూర్ వెళ్లే దారిలో కాజ్‌వే పైనుంచి వరద ప్రవహించడంతో రాకపో కలు నిలిచాయి. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు వరద ముంపు ప్రాంతాలను సంద ర్శించారు. ఇళ్లలోకి నీరు చేరిన బాధితులతో మాట్లాడారు. తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదే శించారు. వర్షాల కారణంగా రాళ్లవాగు ఉధృతి పెరిగింది. బైపాస్ రోడ్డు నుంచి రంగంపేట మధ్య ఉన్న కాజ్‌వే వంత ెనపై నుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో రంగంపేట, పవర్ కాలనీ, పాత మంచిర్యాల, అండాళమ్మ కాలనీల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతాల ప్రజలు ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణిస్తున్నారు. మాతా, శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా జనరల్ దవాఖాన ఎదుట మొకాలి లోతున వరద నిలిచిపోయింది. దీంతో రోగులు, వారి బంధువులు అవస్థలు పడ్డారు. జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహ దారిపై కల్వర్టుపై వరద ప్రవహించడంతో గ్రామస్తులు బయటకు రాలేక ఇబ్బందులు పడ్డారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లను ఎత్తి 1,65,632 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షా లకు 69,393 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 295 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూ సెక్కులు, నంది పంపుహౌజ్ నుంచి 3150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు అధికారులు తెలిపారు. మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల పరిధి లోని గల స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠ శాల, భాగ్యనగర్, విద్యానగర్, టీనగర్ కాలనీ ఇండ్లలోకి నీరు చేరింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కే1 సుభాష్ నగర్‌లో గల అండర్ బ్రిడ్జి ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



## ముంపు ముంగిట ఎంసీహెచ్

- ఎల్లంపల్లి గేట్లు తెరవడంతో గోదావరి ఉగ్రరూపం
- ఆసుపత్రి భవనం చుట్టూ చేరిన వరద నీరు
- రోగులను జీజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది..





**మంచిర్యాల, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలో సోమవారం కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి కురి సిన భారీ వర్షానికి వరద నీరు పట్టణంలోని సూర్య నగర్, హమాలివాడ, తిలక్ నగర్, బృందావన కాలనీ, సున్నం బట్టి వాడ, హైటెక్ సిటీ తదితర వాడల్లోని ఇళ్లలోకి చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతా ల్లో జనజీవనం అతలాకుతలం అయ్యింది. రోడ్లపైకి నీరు చేరడంతో జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి ఆనుకుని ఉన్న రాళ్లవాగు, తోళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాలనీలన్నీ వరద నీటితో నిండుకు న్నాయి. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు వర్షంలోనే జలమ యమైన కాలనీలను తిరిగి పరిశీలించారు.

**ఎంసీహెచ్ చుట్టూ చేరిన వరద నీరు...**

కాలేజీ రోడ్‌లోని ఎంసీహెచ్ చుట్టూ వరద నీరు చేరు కుంది. ఎగువ ప్రాంతం నుండి వరద నీరు వస్తుండడంతో ఆసుపత్రిలోకి రావడానికి, బయటకు వెళ్లేందుకు రోగులు, అటెండర్ లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు విష సర్పాలు ఆసుపత్రి వరకు వస్తుండటంతో ఎక్కడ నుంచి ఏమి వస్తాయోనని భయం గుప్పిట్లో గడుపుతున్నారు.

**బెల్లంపల్లిలో..**

బెల్లంపల్లి పట్టణంతో పాటు మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు కాలనీలకు వరద నీరు చేరింది. కాల్‌టెక్స్ ఏరియాల్లో, రైల్వే స్టేషన్ రోడ్డులో రోడ్డు పక్కన భారీగా వరద నీరు చేరడంతో స్థాని కులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే రాంనగర్ బ్రిడ్జి పై నుంచి వరదనీరు పోటెత్తడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

**మందమర్రి పట్టణంలో..**

మందమర్రిలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నుంచి వరద నీరు మార్కెట్ సెంటర్‌లోకి వచ్చింది. దీంతో మార్కెట్ బురదమయంగా మారింది. ఎంటీవీసీ నుంచి కేకే 5 బంగ్లాస్ వరకు వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్ వద్ద గల పాలవాగు ఉప్పొంగి ప్రవహించింది. స్థానిక పాఠశాలలోకి వరద నీరు చేరింది. అంతేకాకుండా రైల్వేస్టేషన్ సమీపంలోని భాగ్యనగర్ కాలనీలోకి వరద నీరు చేరింది. స్థానిక రెండవ జోన్‌లోని క్వార్టర్లలోకి వరద నీరు చేరింది. స్థానికులు మున్సిపల్ కమీషనర్ రాజలింగుకు సమాచారం అందించడంతో ఆయన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సిబ్బందితో నీటిని తొలగింపజేశారు. కేకే5 గని వెనకాల గల పాలవాగు పొంగడంతో గని అధికా రులు వరద ఉధృతిని పరిశీలించారు. హాజీపూర్ మండలం లో సోమవారం కురిసిన వర్షానికి రాపల్లి శివారులోని పంట పొలాలు నీటమునిగాయి. పందిళ్లు వేసిన బీర, కాకర తోటలు నేలకొరిగాయి. మూడు రోజులుగా కూరగాయల తోటల్లో నీరు నిలువడంతో తెగుళ్లభారిన పడి పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

# నష్ట పోయిన రైతులను ఆదుకుంటాం



**రైతులు ఎవరూ అధైర్యపడొద్దు**
**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమతంగా ఉండాలి**
**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఇంద్రవెల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
వర్ష ప్రభావ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో త్రివేణి సంగం ప్రాజెక్ట్ తో పాటు కోతకు గురైన రోడ్డు, భారీ వర్షాలకు దెబ్బ తిన్న పంటలను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం దస్నాపూర్, వాడగావ్, హీరాపూర్, అంజి గ్రామాలలో పర్యటిస్తూ పిట్ట బొంగారం గ్రామంలో ఇంటి పై కప్పు గాలికి కొట్టుకు పోయి నష్ట పో యిన అనక జంగు కుటుంబాని పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని భారీ వర్షాలకు నష్ట పోయిన రైతులను ఆదు కుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముకడే ఉత్తమ్, పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆ జీవోను తక్షణమే రద్దు చేయండి

**పోడు రైతుల సమస్యపై స్పష్టత కరువు**
**ఎమ్మెల్యే పాల్వాయి ఆమరణ నిరాహార దీక్ష**



**కాగజ్‌నగర్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
పోడు రైతుల సమస్యపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైందని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. పోడు రైతుల సమస్యను పరిష్కరించాలని, జీవో49ని శాశ్వతంగా రద్దు చేయాలన్న ప్రధాన డిమాండుతో హరీష్‌బాబు సోమవారం తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు ఈ నిరవధిక నిర హార దీక్ష కొనసాగిస్తామని ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోడు రైతుల సమస్య పరిష్కరించాలని హరీష్ బాబు కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపట్టగా, సోమవారం ఉదయం ఐదు గంటలకు పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేశారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, నాయకులను కెరమెరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరి పాటు ముట్టడికి విచ్చేస్తున్న నాయకులు, కార్యకర్తలను కాగజ్‌నగర్ డివిజన్ పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి సాయంత్రం వరకు పోలీస్‌స్షేషన్‌లో ఉంచి సొంత పూచికత్తుపై విడిచి పెట్టారు. అలాగే ఎమ్మెల్యే నివాసం వద్ద పోలీసులు రెండంచల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, నాయకులను ఎవరిని కూడా లోనికి పంపించలేదు.

**భారీ బందోబస్తు..**
ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సోమవారం అటవీ శాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనుండటంతో కాగజ్‌నగర్ డివిజన్ పోలీసులు అటవీ శాఖ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యాలయానికి ఫర్లాంగు దూరంలో పోలీసులు క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి ఎవరిని అనుమంతించలేదు. కార్యాలయం సమీపంలోనే పాఠశాల ఉండడంతో విద్యార్థులను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్
# డాక్టర్ మర్రి ప్రవీణారెడ్డి మృతి

**దండేపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**



దండేపల్లి మండలంలోని మేదరిపేటకు చెందిన ప్రముఖ వైద్యురాలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ మర్రి ప్రవీణారెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. 2000-05 లో తెలుగుదేశం పార్టీ తరఫున దండేపల్లి జడ్పీటీసీగా గెలుపొంది, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. వైద్య రంగంలోనూ గుర్తింపుపొందిన ఆమె మేదరిపేటలో ప్రైవేటు నర్సింగ్ హోం నడుపుతూ దండేపల్లి, జన్నారం, కడెం, లక్షెట్టిపేట ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఆమెను 'అమ్మ'గా పిలుచుకునే వారు.. అనతి కాలంలోనే ప్రవీణా రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ప్రవీణా రెడ్డి మరణ వార్తతో మండలంలోని ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మేదరిపేటలోని జరిగిన అంతిమయాత్రలో మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ వాళులర్పించారు.



## ముగిసిన రాష్ట్ర స్థాయి
# బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 5వ సీనియర్ మహిళలు, పురుషులు రాష్ట్రస్థాయి బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. మహిళల విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్ జట్లు సంయుక్త విజేతలుగా, తృతీయ స్థానంలో నల్గొండ జిల్లా జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో హైదరాబాద్, రంగారెడ్డి సంయుక్త విజేత కాగా, తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు రాష్ట్ర బేస్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్వేత బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేస్ బాల్ సంఘం కోశాధికారి కృష్ణ, జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, బీసీ సంఘం అధ్యక్షుడు దత్తు, డీవైఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేడు పాఠశాలలకు సెలవు : కలెక్టర్

**ఆదిలాబాద్, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు నేడు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో, జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుండి అత్యంత భారీ వర్షాలు నమోదవుతుండటంతోవిద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు (ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు) స్థానిక సెలవు ప్రకటించినట్లు తెలిపారు.



## మౌలిక సదుపాయాలు
# మెరుగు పరిచేందుకు కృషి

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**బెల్లంపల్లి, ఆగస్టు 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బాలికల గురుకుల కళా శాల, సాంఘిక సంక్షేమ బాలుర సీవోఈ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య తెలిపారు.బెల్లంపల్లి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల,బాలుర సీవోఈ కళాశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను సిబ్బంది ప్రిన్సిపల్ సొంత బిడ్డలాగా చూసుకోవాలని ప్రిన్సిపల్ నిరూపమకు సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం కాంపౌండ్ వాల్ సోలార్ ఫెన్సింగ్ నిర్మించాలని, బాలుర సీవోఈ పాఠశాలలో ఆర్వో ప్లాంట్లను మరమత్తులు చేయించాలని ప్రిన్సిపల్ విజయసాగర్ కు సూచించారు. పాఠశాలల్లోకి చెరువు బ్యాక్ వాటర్, రాకుండా నిల్వ ఉండకుండా మందమర్రి సింగరేణి సీఎంతో మాట్లాడి మట్టి కుప్పలు పోయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను,సబ్ కలెక్టర్ మనోజ్ ను ఆదేశిస్తున్నట్లు వెంకటయ్య తెలిపారు. పాఠశాలల్లో ఏదైనా సమస్య ఉంటే తమకు నేరుగా చెప్పాలని లేదా రాష్ట్ర కమీషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ దృష్టికి తీసుకు రావాలన్నారు. బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యపై స్పందించిన తాళ్ళ గురిజాల ఎస్సై రామకృష్ణను వెంకటయ్య అభినందించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పటి వరకు రాష్ట్రంలోని 20 గురుకుల పాఠశాలలను సందర్శించినట్లు వెంకటయ్య తెలిపారు. అనంతరం బూడిదగడ్డ బస్తీలో ఇటీవల అధికారులు అడ్డుకున్న గణేష్ మండప నిర్మాణాన్ని ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తాత్కాలికంగా షెడ్డు వేసుకొని గణేష్, దుర్గామాత నవరాత్రులను నిర్వహించిన ఏర్పాట్లు చేపట్టుకోవాలని అధికారుల సమక్షంలో బస్తీ వాసులకు సూచించారు.